


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 306, పేజీలు - 08
శనివారం, ఏప్రిల్ 25, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# కవిత పార్టీ ఫస్ట్ టార్గెట్
# బీఆర్ఎస్ ఓటు బ్యాంక్.?



### - సెంటిమెంట్లు లేని రాజకీయాలే, కేటీఆర్ తట్టుకోగలరా?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో మరికొన్ని గంటల్లో ఒక కొత్త అధ్యాయం మొదలవ్వబోతోంది. కల్వకుంట్ల కవిత తన నూతన రాజకీయ పార్టీని లాంఛనంగా ప్రకటించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. ఈ ప్రక్రియలో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే కవిత తన రాజకీయ లక్ష్యం విషయంలో స్పష్టతతో ఉండటం. ఆమె వేస్తున్న ప్రతి అడుగు, ఎక్కుపెడుతున్న ప్రతి విమర్శ కేవలం ఒకే ఒక్క దిశగా సాగుతున్నాయి-అదే బీఆర్ఎస్ ఓటు బ్యాంకు

**- స్పష్టమైన టార్గెట్..**
**కాంగ్రెస్, బీజేపీ కాదు.. బీఆర్ఎస్సే!**

సాధారణంగా కొత్త పార్టీలు అధికార పార్టీని విమర్శించడం ద్వారా ఉనికిని చాటుకుంటాయి. కానీ కవిత మాత్రం అధికార కాంగ్రెస్‌ను , దూకుడుగా ఉన్న బీజేపీని కాకుండా, బీఆర్ఎస్ మీదనే ఎక్కువ దృష్టి సారించారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు సిద్ధాంతపరంగా ఆమె వైపు వచ్చే అవకాశం లేదని, అలాగే బీజేపీ హిందూత్వ ఓటు బ్యాంకు తన దరి చేరదని ఆమెకు బాగా తెలుసు. అందుకే, గత పదేళ్లుగా బీఆర్ఎస్ వెన్నంటి ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకును, ఆ పార్టీ పట్ల అసంతృప్తిగా ఉన్న శ్రేణులను తన వైపు తిప్పుకోవడమే ఆమె సింగిల్ పాయింట్ అజెండా గా కనిపిస్తోంది.

**- కారు స్పీడుకు బ్రేకులు వేసే వ్యూహం**

బీఆర్ఎస్ పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో కవిత ఎంట్రీ ఆ పార్టీకి పెనుగండంగా మారేలా ఉంది. బీఆర్ఎస్ వైఫల్యాలను, ముఖ్యంగా మలి దశ తెలంగాణ ఉద్యమకారులకు జరిగిన అన్యాయాన్ని ఆమె పదే పదే ప్రస్తావిస్తుండటం యాదృచ్ఛికం కాదు. రేపు జరగబోయే ఆవిర్భావ సభలో కూడా ఆమె ప్రసంగం బీఆర్ఎస్ అధినాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకునే సాగే అవకాశం ఉంది.
తండ్రి చాటు బిడ్డగా కాకుండా,

2లో..

# ఆప్‌లో తిరుగుబాటు

**- బీజేపీలో విలీనమైన రాజ్యసభ సభ్యుల బృందం**
**- రాజ్యాంగ నిబంధనల రక్షణతో విలీనం**
**- ఆప్ దారి తప్పిందన్న రాఘవ్ చద్దా**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లో ముసలం పుట్టింది. ఇటీవల రాజ్యసభలో ఆప్ డిప్యూటీ లీడర్ పదవి నుంచి తొలగింపునకు గురైన యువ ఎంపీ రాఘవ్ చద్దా బీజేపీలో చేరబోతున్నట్టు ప్రకటించారు. ఆప్ ప్రస్తుతం అవినీతిపరుల చేతుల్లో ఉందని, ఎంతో కష్టపడి పార్టీని పైకి తీసుకొచ్చామని చద్దా విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షాల నాయకత్వంలో పనిచేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆయన సహా ఏడుగురు ఎంపీలు బీజేపీలో చేరనున్నట్టు వెల్లడించారు. రాజ్యసభలోని ఆప్ ఎంపీలో మూడింట రెండొంతుల మంది పార్టీని వీడుతున్నారు.

2లో..

## చర్చలతోనే పరిష్కారం..
# ప్రాణాలు తీసుకోవద్దు

**- మంత్రుల బృందంతో జేఏసీ నేతల భేటీ**
**- శంకర్ గౌడ్ మృతిపట్ల మంత్రులు, జేఏసీ నేతల సంతాపం**
**- 29 అంశాలకు సానుకూలంగా ఉన్నట్లు తెలిపిన మంత్రులు**
**- ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె మూడవ రోజుకు చేరుకుంది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ అయింది. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ భేటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు,



ప్రత్యేక సీఎస్ వికాస్ రాజ్ కూడా హాజరయ్యారు.

2లో..

## 2011 మిలియన్ మార్చ్ కేసులను కొట్టివేసిన హైకోర్టు

**- కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులకు బిగ్ రిలీఫ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీమంత్రి,బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావులకు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. సుదీర్ఘ కాలంగా

2లో..

# నేరగాళ్లతో పోరాడటం నాకు కొత్తనే

### - క్రిమినల్స్‌తో రాజకీయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్న చంద్రబాబు

**- టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్‌ల శిక్షణ శిబిరానికి హాజరైన పార్టీ అధినేత చంద్రబాబు**
**- కార్యకర్తలే టీడీపీకి అధినేతలని, ప్రతి ఒక్కరూ నాయకుడిగా ఎదగాలని పిలుపు**
**- వైసీపీ విధ్వంసాన్ని ప్రజలకు గుర్తుచేస్తూ, ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాలని దిశానిర్దేశం**



అమరావతి (ప్రశ్న న్యూస్) 'టీడీపీలో కార్యకర్తలే అధినేతలు, రైట్ రాయల్‌గా బతకాలి. పార్టీ కూడా కార్యకర్తలను అంతే గౌరవిస్తుంది'అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జిల శిక్షణా తరగతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణా తరగతులకు వచ్చిన క్లస్టర్ ఇన్‌చార్జిలతో కాఫీ కబుర్లు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సిద్దాంతాలు పార్టీ సంస్థాగత బలోపేతం ప్రభుత్వ పథకాలు వంటి అంశాలపై క్లస్టర్ ఇన్‌చార్జిలతో సీఎం చంద్రబాబు నాయుడు చర్చించారు.ప్రతీ కార్యకర్తను నాయకుడిగా తీర్చిదిద్దుతామని కేడర్ దాన్ని అందిపుచ్చుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

**- క్రిమినల్స్‌తో రాజకీయం చేయాల్సిన పరిస్థితి**

క్లస్టర్ ఇన్‌చార్జిలు సమకాలీన రాజకీయాలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు.

2లో..

# 365 రోజులు పంటలు పండించాలి.. రైతన్నపంట పండాలి

**- వ్యవసాయ రంగంపై ఉన్నతస్థాయి సమీక్ష**

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం చూపే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో, దానిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టింది. వ్యవసాయ రంగంపై ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం జరిపిన ఉన్నతస్థాయి సమీక్షలో ఈ అంశంపై ప్రధానంగా చర్చించారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల వల్ల సగటు వర్షపాతం 92 శాతానికే పరిమితం కావచ్చని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రాయలసీమలోని అనంతపురం, సత్యసాయి, కడప, కర్నూలుతో పాటు ప్రకాశం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు తలెత్తవచ్చని, ఇది పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ సవాలును అధిగమించేందుకు 'ప్రీ-మాన్‌సూన్ డ్రై సోయింగ్' (పీఎండీఎస్) విధానాన్ని ఒక అస్త్రంగా ప్రయోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వర్షాలు కురవకముందే విత్తనాలు నాటే ఈ పద్ధతి ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చు, ఎరువులు, నీటి వినియోగం తగ్గుతుందని అధికారులు వివరించారు. తద్వారా ఎకరాకు రూ.5,000 నుంచి రూ.7,000 వరకు అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఎకరాల్లో పీఎండీఎస్ విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా నిర్దేశించారు.

2లో..



# అకృత్యాల నుంచి ఆడబిడ్డలకు విముక్తి కల్పిస్తాం

### - బెంగాల్ మహిళలకు ప్రధాని మోదీ హామీ

కోల్కతా (ప్రశ్న న్యూస్) బెంగాల్లో బీజేపీ పార్టీకి ఓటు వేస్తే, ఆడబిడ్డలపై టీఎంసీ ప్రభుత్వం కొనసాగిస్తున్న అకృత్యాల నుంచి విముక్తి కల్పిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. బెంగాల్ రెండో దశ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో బీజేపీకి మద్దతు తెలపాలని ఆ రాష్ట్ర మహిళా ఓటర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు. మహిళలు రాత్రిపూట బయటకు రావద్దని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలను కూడా ప్రధాని మోదీ తీవ్రంగా తప్పుబట్టారు. దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ హత్యాచారం ఉదంతాన్ని ప్రస్తావిస్తూ, ఆ ఘోరమైన నేరానికి టీఎంసీ పార్టీయే బాధ్యత వహించాలని మోదీ అన్నారు. బాధితురాలి తల్లిని తమ పార్టీ అభ్యర్థిగా ప్రకటించినట్లు ఆయన వెల్లడించారు.

**- మహిళా శక్తిపై పూర్తి నమ్మకం ఉంది!**

బెంగాల్ మహిళా శక్తిపై తనకు పూర్తి నమ్మకం ఉందని, వారు 21వ శతాబ్దపు బెంగాల్ కొత్త చరిత్రను రాస్తారని మోదీ ధీమా వ్యక్తం చేశారు. "బంగాల్ మహిళా శక్తిని నేను చూస్తున్నాను. వారు 21వ శతాబ్దపు బెంగాల్ నవ చరిత్రను రాయనున్నారు. ఇకపై మేము టీఎంసీ ప్రభుత్వాన్ని

2లో..



## తెలంగాణలో ఐపీఎస్ అధికారుల బదిలీ

**- హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా శిఖాగోయల్**

2లో..



## పంజాబ్‌లో 'ఆపరేషన్ లోటస్' అమలు చేశారు

**- రాఘవ్ చద్దా ఫిరాయింపుపై కేజ్రీవాల్ తొలి స్పందన**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా నేతృత్వంలో ఏడుగురు పార్లమెంట్ సభ్యులు పార్టీని వీడటం ఆమ్ ఆద్మీ పార్టీలో (ఆప్) పెను దుమారం రేపింది. పార్టీ మారుతున్న వారిపై ఆప్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. వారిని 'ద్రోహులు'గా అభివర్ణిస్తూ, పంజాబ్ ప్రజలు ఈ వెన్నుపోటును ఎప్పటికీ మర్చిపోరని, క్షమించరని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారం వెనుక

2లో..

# ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండ

### - రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) టీజీఎస్ఆర్టీసీ సమ్మెలో భాగంగా పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతి చెందిన డ్రైవర్ కోల శంకర్ గౌడ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. ఆయన మృతి పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన ప్రభుత్వం, తక్షణమే స్పందించి పరిహార చర్యలు చేపట్టింది. ఈ మేరకు నర్సంపేట ఆర్డీవో ఉమారాణి అధికారికంగా వివరాలు వెల్లడించారు. ప్రభుత్వం తరఫున శంకర్ గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం (ఎక్స్‌గ్రేషియా) అందిస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. దీంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. నిరుపేద కుటుంబం కావడంతో వారికి ఒక ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తన వ్యక్తిగత హోదాలో మరో రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. దీంతో శంకర్ గౌడ్ కుటుంబానికి మొత్తం రూ.15 లక్షల ఆర్థిక సాయం అందనుంది. ఆర్డీవో ఉమారాణి స్వయంగా శంకర్ గౌడ్ మృతదేహానికి నివాళు లర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. గత 25 ఏళ్లుగా ఆర్టీసీ డ్రైవర్‌గా సేవలందించిన శంకర్ గౌడ్‌కు భార్య హేమలత, కుమార్తె షామిలి, కుమారుడు హేమంత్ ఉన్నారు. ఆయన భార్య దివ్యాంగురాలు కావడం, సొంత ఇల్లు



లేకపోవడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది.

# కవిత పార్టీ ఫస్ట్ టార్గెట్ బీఆర్ఎస్ ఓటు బ్యాంక్.?

తెలంగాణ ఆకాంక్షలను మోసే స్వతంత్ర గళంగా తనను తాను ఆవిష్కరించుకోవడం ద్వారా బీఆర్ఎస్ క్యాడర్‌లో చీలిక తీసుకురావడమే ఆమె అసలు ప్లాన్.

**- రాజకీయ ఉనికి కోసం పోరాటం**

నేటి రాజకీయాల్లో కేవలం సెంటిమెంట్‌తోనే ఓట్లు పడవని గుర్తించిన కవిత, క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ బలహీనపడిన చోట తన పట్టును పెంచుకోవాలని చూస్తున్నారు. బీఆర్ఎస్ ఓటు బ్యాంకు చెల్లాచెదురైతే, అది కాంగ్రెస్‌కో లేదా బీజేపీకో వెళ్లకుండా తన కొత్త పార్టీ ఒక షెల్టర్ లాగా ఉపయోగపడాలని ఆమె ఆశిస్తున్నారు. ఈ వ్యూహం గనుక పారితే, బీఆర్ఎస్ ఉనికికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఒక రకంగా చెప్పాలంటే, బీఆర్ఎస్ పునాదుల మీదనే తన రాజకీయ సౌధాన్ని నిర్మించుకోవాలని కవిత గట్టి నిర్ణయానికి వచ్చారు.

**- మొహమాటాలకు తావులేని సమరం**

రాజకీయాల్లో బంధుత్వాలు ఉండవు, కేవలం బాధ్యతలే ఉంటాయి అనే సంకేతాన్ని కవిత ఇప్పటికే ఇచ్చారు. కేసీఆర్ అనుసరించిన కొన్ని విధానాలను ఆమె బహిరంగంగానే తప్పుపట్టడం ద్వారా, తాను బీఆర్ఎస్ బి–టీమ్ కాదనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. ఆవిర్భావ సభ తర్వాత ఆమె చేపట్టబోయే కార్యక్రమాలు కూడా బీఆర్ఎస్ కంచుకోటలుగా ఉన్న జిల్లాల్లోనే ఎక్కువగా ఉండేలా ప్లాన్ చేశారు. ఇది కచ్చితంగా గులాబీ దళానికి ఒక హెచ్చరిక లాంటిదే. కవిత రాజకీయ చదరంగంలో తొలి పావును అత్యంత తెలివిగా కదిపారు. ప్రత్యర్థులైన కాంగ్రెస్, బీజేపీలను వదిలేసి, తన సొంత ఇంటి ఓటు బ్యాంకుపైనే ఆమె యుద్ధం ప్రకటించడం తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు దారితీస్తోంది. నేటి సభలో ఆమె ప్రకటించబోయే పార్టీ పేరు, విధివిధానాలు బీఆర్ఎస్ భవిష్యత్తును ఏ మేరకు ప్రభావితం చేస్తాయోనన్న ఆందోళన ఇప్పుడు ఆ పార్టీ వర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. కవిత కొత్త ప్రయోగం' విజయవంతమైతే, తెలంగాణలో బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకోవడం అత్యంత కష్టతరంగా మారవచ్చు.

# ఆప్ లో తిరుగుబాటు

ఆప్ పార్లమెంటరీ పార్టీని బీజేపీలో విలీనం చేయనున్నారు. రాఘవ్ చద్దా , సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్‌లు పార్టీని వీడి బీజేపీలో చేరనున్నట్లు ప్రకటించడం గమనార్హం. ఈ పరిణామం అరవింద్ కేజ్రీవాల్‌కి పెద్ద ఎదురుదెబ్బగానే చెప్పుకోవాలి. ఇటీవలే డిప్యూటీ లీడర్ పదవి నుంచి రాఘవ్ చద్దాను తొలగించి ఆయన స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించారు. అశోక్ మిట్టల్ కూడా కేజ్రీకి హ్యాండిచ్చి, బీజేపీలో చేరుతుండటం గమనార్హం. రాజ్యసభలో ఆప్‌కి మొత్తం 10 మంది ఎంపీలు ఉండగా ఇప్పటికే హర్భజన్ సింగ్, స్వాతి మలివాల్‌లు పార్టీకి దూరమయ్యారు.బీజేపీలో విలీనమవుతున్న ఎంపీలలో హర్భజన్ సింగ్, స్వాతి మాలివాల్ ఉన్నారని, మరో నలుగురు రాజిందర్ గుప్తా, విక్రమ్ సింగ్ సాహ్ని, అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్‌ల పేర్లను చద్దా వెల్లడించారు. “నేను నా జీవితంలోని 15 ఏళ్లు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి అంకితం చేశాను, ఇప్పుడు ఆ పార్టీ అవినీతిపరుల చేతుల్లో ఉంది నేను తప్పుడు పార్టీలో ఉన్న సరైన వ్యక్తిని. నేను పార్టీకి దూరమై ప్రజలకు దగ్గరవుతున్నాను ” అని ఆయన వ్యాఖ్యానించారు. తమ వెంట 8 మంది ఎంపీలు ఉన్నారని చద్దా తెలిపారు. ఇక, యువ ఎంపీ బీజేపీలో చేరిన తర్వాత కేంద్ర మంత్రి పదవి దక్కే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి.ఇటీవల డిప్యూటీ లీడర్ పదవి నుంచి తొలగించిన తర్వాత ‘తాను మౌనంగా ఉన్నా కానీ ఓడిపోలేదు నేను ఏ తప్పు చేశానో చెప్పాలి’ అని ఆప్ అధిష్ఠానాన్ని రాఘవ్ చద్దా నిలదీశారు. చద్దా, అరవింద్ కేజ్రీవాల్ మధ్య గత కొన్ని రోజులుగా దూరం పెరిగింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఆయనను సీబీఐ ప్రత్యేక కోర్టు నిర్దోషిగా ప్రకటించిన తర్వాత కూడా చద్దా స్పందించలేదు. కేజ్రీవాల్‌కు మద్దతుగా ఒక్క మాట కూడా మాట్లడలేదు. ఈ క్రమంలోనే రాజ్యసభ డిప్యూటీ లీడర్ పదవి నుంచి తొలగించి, అశోక్ మిట్టల్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు.

# చర్చలతోనే పరిష్కారం..ప్రాణాలు తీసుకోవద్దు

వరంగల్ జిల్లా నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మంత్రులు, జేఏసీ నేతలు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని మంత్రులు భరోసా ఇచ్చారు. ఏ కార్మికుడు కూడా ఆవేశంతో అనాలోచిత నిర్ణయం తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటిని తక్షణమే అమలు చేయాలని జేఏసీ నేతలు పట్టుబట్టారు.

కార్మికులు లేవనెత్తిన 32 డిమాండ్లలో 29 అంశాలకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రులు తెలిపారు. మిగిలిన మూడు అంశాలపై అధ్యయనం కోసం కొంత సమయం కావాలని అన్నారు. అయితే ఏయే డిమాండ్లు ఎప్పటిలోగా అమలు చేస్తారో లిఖితపూర్వక హామీ ఇవ్వాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ సమస్యలు ఎంత క్లిష్టమైనా చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని, ప్రాణాలు తీసుకోవడం సరైన నిర్ణయం కాదని హితవు పలికారు. ఇది మనందరి ‘ప్రజా ప్రభుత్వం’ అని, ఎవరినీ శత్రువులుగా చూసే స్వభావం తమకు లేదని స్పష్టం చేశారు.

గత పదేళ్లలో ఆర్టీసీ చిన్నాభిన్నమైందని, అప్పట్లో కార్మికుల పట్ల పాలకులు కఠినంగా వ్యవహరించారని అన్నారు. తాము అలా చేయబోమని భరోసా ఇచ్చారు. వివిధ రాష్ట్రాల ఎన్నికల ప్రచారం, ఇతర ప్రభుత్వ పనుల వల్ల తాము బిజీగా ఉన్న సమయంలో అకస్మాత్తుగా సమ్మె నిర్ణయం తీసుకోవడం వల్లే శంకర్ గౌడ్ ను కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీని బలోపేతం చేసి, కార్మికుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# 2011 మిలియన్ మార్చ్ కేసులను కొట్టివేసిన హైకోర్టు

వెంటాడుతున్న కేసును తెలంగాణ హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. తెలంగాణ ఉద్యమ సమయంలో దాదాపుగా 15 ఏళ్ల క్రితం నమోదు అయిన కేసులను తెలంగాణ న్యాయస్థానం కొట్టి వేసింది. వివరాల్లోకి వెళ్తే 2011లో తెలంగాణ మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న సంగతి తెలిసిందే. తెలంగాణ మలిదశ ఉద్యమంలో భాగంగా 2011 మార్చి 10న హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై మిలియన్ మార్చ్‌కు పిలుపునిచ్చారు.

ఈ మిలియన్ మార్చ్‌లో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విధించిన ఆంక్షలను ధిక్కరించి ‘మిలియన్ మార్చ్’ నిర్వహించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించారన్న ఆరోపణలతో నాడు కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు కీలక నేతలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులపై అప్పటి నుంచి విచారణ జరుగుతుంది.అయితే శుక్రవారం కూడా విచారణ జరిపిన హైకోర్టు ఈ కేసుపై కీలక వ్యాఖ్యలు చేసింది. రాజకీయ కారణాలతో, ఉద్యమ సమయంలో నమోదైన ఈ కేసులను కొనసాగించాల్సిన అవసరం లేదని భావిస్తూ వాటిని కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# పంజాబ్‌లో ‘ఆపరేషన్ లోటస్’ అమలు చేశారు

బీజేపీ హస్తం ఉందని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నుంచి పంజాబ్ సీఎం భగవంత్ మాన్ వరకు అందరూ ఆరోపించారు. “పంజాబీలకి బీజేపీ మరోసారి వెన్నుపోటు పొడిచింది” అని కేజ్రీవాల్ ఒకే వాక్యంలో తీవ్రంగా వ్యాఖ్యానించారు. రాజ్యసభలో ఆప్ నేత సంజయ్ సింగ్ మాట్లాడుతూ పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల ముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో బీజేపీ ‘ఆపరేషన్ లోటస్’ను అమలు చేసిందని సంచలన ఆరోపణలు చేశారు. పార్టీ మారిన ఎంపీలను ‘ద్రోహులు’గా పేర్కొంటూ, “ఆమ్ ఆద్మీ పార్టీకి, పంజాబ్ ప్రజలకు ఎప్పుడు ద్రోహం జరిగినా, ప్రజలు దానికి తగిన బుద్ధి చెప్పారు.

ఈ ద్రోహానికి, మోసానికి కూడా పంజాబ్ ప్రజలు సరైన సమాధానం ఇస్తారు” అని సంజయ్ సింగ్ అన్నారు. “పంజాబ్ రైతులకు వ్యతిరేకంగా మూడు వివాదాస్పద వ్యవసాయ చట్టాలు చేసిన పార్టీలో చేరి నిజాయతీ కోసం పోరాడతారా? రైతుల హత్య కేసులో నిందితుడిగా ఉన్న కేంద్ర మంత్రి కొడుకు ఉన్న పార్టీలోకి వెళతారా?” అని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ఇది అత్యంత నీచమైన ద్రోహం, మోసం అని ఆప్ అధికార ప్రతినిధి అనురాగ్ దండా వ్యాఖ్యానించారు. మరోవైపు, ఆప్ పంజాబ్ యూనిట్ ప్రధాన కార్యదర్శి బల్తేజ్ పన్నూ మాట్లాడుతూ... కేంద్ర ఏజెన్సీలను ఉపయోగించి ఆప్‌ను బలహీనపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ ప్రణాళికను అమలు చేయడానికి రాఘవ్ చద్దాను అమిత్ షా ఒక ‘సాధనంగా’ వాడుకున్నారని ఆయన పేర్కొన్నారు.

# నేరగాళ్లతో పోరాడటం నాకు కొత్తనే

అధికారం కోల్పోయిన తర్వాత కూడా వైసీపీ చేస్తున్న అరాచకాలను సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు. ప్రస్తుత పరిణామాల్లో క్రిమినల్స్‌తో రాజకీయం చేయాల్సిన పరిస్థితి వచ్చిందనే విషయాన్ని నిరంతరం గుర్తుపెట్టుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు హితబోధ పలికారు. ఇటీవల జరిగిన దస్తగిరి హత్య, ఎమ్మెల్సీ అనంతబాబు బరితెగింపు వంటి అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా ప్రస్తావించారు.

**- అవకాశాలను ఉపయోగించుకుని కార్యకర్తలు నాయకులుగా ఎదగాలి**

‘అవకాశాలను ఉపయోగించుకుని కార్యకర్తలు నాయకులుగా ఎదగాలి. ప్రజలకు మంచి చేస్తే ప్రజలు నిరంతరం గుర్తుంచుకుంటారు. సుదీర్ఘ కాలం అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యం’ అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ‘2019లో వైసీపీ గెలిచింది, రాష్ట్రం అభివృద్ధిలో వెనక్కివెళ్లింది. నన్ను అరెస్టు చేసినా, పార్టీని ఇబ్బంది పెట్టినా కార్యకర్తలను కాపాడుకున్నాను. రాజకీయాలను దాటి సామాన్య ప్రజల్ని నాటి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేసింది’అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

**- టీడీపీ కార్యకర్తలు రైట్ రాయల్‌గా బతకాలి**

‘2019–24 మధ్య జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు నిత్యం గుర్తు చేయాలి.మనం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించడంతో పాటు కార్యక్రమాల అమలుకు ప్రభుత్వం పడే కష్టాన్ని ప్రజలకు తెలియచేయాలి’అని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. ‘టీడీపీలో కార్యకర్తలే అధినేతలు రైట్ రాయల్‌గా బతకాలి. పార్టీ కూడా కార్యకర్తలను అంతే గౌరవిస్తుంది. కిల్లర్ పార్టీతో అందరూ జాగ్రత్తగా ఉండాలి. కిల్లర్ పార్టీ ఆలోచనా విధానాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి కౌంటర్ ఇవ్వాలి. రోడ్ల మీదకు వస్తారు రెచ్చగొడతారు రప్పా రప్పా అంటారు ప్రజలను ఇబ్బందులు పెడతారు చర్యలు తీసుకుంటే రాజకీయమంటారు. అన్యాయం జరిగిందని పరామర్శకు వెళ్తారు కార్యకర్తలను కార్ల కింద తొక్కించి చంపేస్తారు కానీ తన కారు కింద పడిపోయిన కార్యకర్తను మాత్రం పరామర్శించరు. కడపలో సొంత పార్టీ కార్యకర్తనే హత్య చేశారు. కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి కలిసి ప్రభుత్వ భూముల్ని దోపిడీ చేశారు. పంపకాల్లో విభేదాలు రావడంతో దస్తగిరి అనే కార్యకర్తను చంపేశారు. వాళ్ల మనుషుల్ని వాళ్లే చంపుకుని నేరం మనపై నెట్టేస్తారు’అని సీఎం చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు.

**- నేరగాళ్లతో పోరాడటం నాకు కొత్తనే**

‘నా జీవితంలో రాజకీయ పోరాటాలు చేశాను తప్ప నేరగాళ్లతో ఏనాడూ పోరాడలేదు. ఇది నాకు కొత్తగానే ఉంది. ఎన్నిలయ్యేదాకా వివేకా హత్యను వాడుకున్నారు, అధికారంలోకి వచ్చాక న్యాయం చేయండని సునీతారెడ్డి అడిగితే సైలెంట్‌గా ఉండమని ఆమెను బెదిరించారు’అని సీఎం చంద్రబాబు నాయుడు ఆరోపించారు. ‘ఆస్తి విషయంలో తల్లి, చెల్లిపై ఎవరైనా కోర్టుకు వెళ్తారా.? సోషల్ సైకోలతో తప్పుడు ప్రచారాలు చేయిస్తున్నారు. ఇలాంటి పార్టీని నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంను గొడ్డలి పార్టీ ఎమ్మెల్సీ హత్య చేశాడు. కోర్టులో సాక్ష్యం చెప్పినవారిని బెదిరించారు. గొడ్డలి పార్టీ చేసే అరాచకాలను అనునిత్యం ప్రజలకు వివరిస్తూనే ఉండాలి’అని సీఎం చంద్రబాబు నాయుడు క్లస్టర్ ఇన్‌చార్జిల సమావేశంలో దిశానిర్దేశం చేశారు.

# 365 రోజులు పంటలు పండించాలి.. రైతన్నపంట పండాలి

**- వ్యవసాయంలో సమూల మార్పులే లక్ష్యం**

రైతుకు సాగు భద్రత కల్పించి, అధిక ఆదాయం సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఏడాదంతా పొలం పచ్చగా ఉండేలా, భూమిని భాగాలుగా విభజించి ఒకే రైతు బహుళ పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటల వైపు రైతులను మళ్లించాలని, వాటి వల్ల కలిగే లాభాలను వివరించి చెప్పాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతు బజార్ల నుంచి నేరుగా ఇంటికే సరుకులు డెలివరీ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, అవసరమైతే ఏజెన్సీల సేవలు వినియోగించుకోవాలని ఆదేశించారు.

**- హార్టికల్చర్ హబ్.. ప్రత్యేక పంటలపై దృష్టి**

రాష్ట్రంలో ఉద్యానవన రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. మొత్తం 50 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ సాగు చేపట్టేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా రాయలసీమను ‘గ్లోబల్ హార్టికల్చర్ హబ్’గా తీర్చిదిద్దేందుకు క్లస్టర్ల వారీగా అభివృద్ధి ప్రణాళికలు చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా ప్రపంచంలోనే తొలిసారిగా 250 ఎకరాల్లో ‘కోకో సిటీ’ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇది ఔత్సాహిక రైతులకు ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా ఉపయోగపడాలని సూచించారు. అరకులో కుంకుమ పువ్వు, అనంతపురంలో యాపిల్ సాగును ప్రోత్సహించడంతో పాటు అవకాడో, అంజీర్, పనస, మిరియాల సాగును విస్తరించాలని నిర్దేశించారు. అంజీర్ వంటి పండ్లను డ్రైఫ్రూట్స్‌గా మార్చి విలువ పెంచేలా చూడాలన్నారు. ‘ఏపీ మష్రూమ్ మిషన్ 2026–31’ కింద ఏటా లక్ష మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించాలని లక్ష్యం నిర్దేశించారు.

**- ప్రకృతి సాగుకు పెద్దపీట**

రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని అన్ని గ్రామాలకు విస్తరించాలని ముఖ్యమంత్రి భారీ లక్ష్యాన్ని నిర్దేశించారు. 2025–26లో 9.26 లక్షల హెక్టార్లలో ప్రకృతి సేద్యం జరగగా, ఈ ఏడాది (2026–27) ఏకంగా 11 లక్షల హెక్టార్లకు పెంచాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 13,300 గ్రామ పంచాయతీల్లో 25 లక్షల మంది రైతులను ఇందులో భాగస్వాములను చేయాలన్నారు. ప్రకృతి సాగు ఉత్పత్తులకు సరైన సర్టిఫికేషన్ అందించి, అధిక ధరకు అమ్ముకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**- సాంకేతికతతో రైతుకు భరోసా**

వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత వినియోగంపై సీఎం దృష్టి సారించారు. ‘ఫార్మర్ యాప్’లో ఇప్పటివరకు 8 లక్షల మంది రైతులు నమోదు చేసుకున్నారని అధికారులు తెలుపగా, రిజిస్ట్రేషన్‌తో పాటు ఎంతమంది రైతులు దానిని వినియోగించి లబ్ధి పొందుతున్నారనేదే ముఖ్యమని సీఎం అన్నారు. ఈ యాప్ ద్వారా పంటల వివరాలు, భూసార పరీక్షలు, వాతావరణ సమాచారం, ప్రభుత్వ పథకాలు వంటివి రైతులకు అందుబాటులో ఉంటాయి. అదేవిధంగా, రైతు భరోసా కేంద్రాల పనితీరును పర్యవేక్షించేందుకు రూపొందించిన ‘ఆర్ఎస్కే ఇంటిలిజెన్స్ హబ్ డ్యాష్‌బోర్డ్’లో సమాచారం ఎప్పటికప్పుడు కచ్చితంగా ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.

# తెలంగాణలో ఐపీఎస్ అధికారుల బదిలీ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో మరోసారి పలువురు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణ రావు శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేశారు. రెండు రోజుల కిందటే మహేష్ భగవత్, వీవీ శ్రీనివాసరావు, చారు సిన్హా, అనిల్ కుమార్, వీసీ సజ్జనార్, స్వాతి లక్రా సహా ఆరుగురు సీనియర్ ఐపీఎస్‌లకు ప్రభుత్వం పదోన్నతలు కల్పించిన విషయం తెలిసిందే. తాజాగా, ఏడుగురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేసి, పలువురికి అదనపు బాధ్యతలను కూడా అప్పగించింది. ఇందులో సీనియార్టీ ప్రాతిపదికన కీలక పోస్ట్‌ల్లో నియమించింది. 1994 బ్యాచ్‌కు చెందిన శిఖా గోయల్‌ను హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించారు. ప్రస్తుతం ఆమె విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీజీగా, సాధారణ పరిపాలన శాఖ ఎక్స్–ఆఫిషియో ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.

అంతేకాదు, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతల్లో ఆమె కొనసాగుతారు. ఇక, 1997 బ్యాచ్ ఐపీఎస్ దేవేంద్ర సింగ్ చౌహాన్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీజీగా నియమించారు. ప్రస్తుతం చౌహాన్ అదనపు డీజీపీ (పర్సనల్)గా ఉన్నారు. అలాగే, డ్రగ్స్ కంట్రోల్ డీజీగా ఉన్న 2003 బ్యాచ్‌కు చెందిన షానవాజ్ ఖాసిమ్‌ను మల్టీ జోన్–××గా ఐజీగా, అలాగే పోలీస్ పర్సనల్ విభాగం ఐజీపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. 2004 బ్యాచ్ అధికారి యాంటీ కరప్షన్ బ్యూరో డైరెక్టర్ తరుణ్ జోషిని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ప్రస్తుత సీపీ సుధీర్ బాబు రిటైర్ అవుతున్న నేపథ్యంలో ఈ నియామకం జరిగింది.

మల్కాజ్‌గిరి సీపీ అవినాష్ మొహంతి (2005 బ్యాచ్) డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్‌గా నియమించారు. అలాగే ఏసీబీ డైరెక్టర్‌గా ఆయన అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇంటెలిజెన్స్ ఐజీ, 2006 బ్యాచ్‌కు చెందిన బి సుమతికి మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా, ఇంటెలిజెన్స్ ఐజీపీ 2006 బ్యాచ్ అధికారి కార్తికేయకు ఎస్ఐబీ (ఇంటెలిజెన్స్) ఐజీపీగా అదనపు బాధ్యతలు కట్టబెట్టింది.

# అకృత్యాల నుంచి ఆడబిడ్డలకు విముక్తి కల్పిస్తాం

మార్చితీరుతాం, ఇకపై మేము దానిని సహించమని బెంగాల్లోని ప్రతి మహిళ చెబుతోంది. బెంగాల్లోని ప్రతి ఆడబిడ్డకు నేను హామీ ఇస్తున్నాను. బీజేపీ మీ కలలను కలుషితం కానివ్వదు” అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**- ఇది మోదీ గ్యారెంటీ!**

“బెంగాల్ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, మహిళలకు భద్రత కల్పిస్తాం. తప్పు చేసిన వారు శిక్షించబడతారు. మే 4న బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ప్రతి అన్యాయం, ప్రతి అకృత్యంపై ఫైళ్లు తెరుస్తాం. ఇది మోదీ గ్యారెంటీ” అని అన్నారు. ‘బెంగాల్లోని ప్రతి సోదరి, కుమార్తె కలలను నెరవేర్చడానికి, వారి జీవితాలను సులభతరం చేయడానికి బీజేపీ కట్టుబడి ఉంది. బంగాల్ సోదరీమణులకు బీజేపీ నేరుగా ఇచ్చే వాగ్దానం ఏమిటంటే, బీజేపీ మీకు భద్రత ఇస్తుంది. గౌరవం ఇస్తుంది. బీజేపీతోనే మీకు ఐశ్వర్యం లభిస్తుంది. బీజేపీ ప్రభుత్వంలో ప్రతి మహిళ జీవితంలో సంతోషం వస్తుంది. పేద సోదరీమణులకు ఉచిత రేషన్ అందిస్తుంది. ఏ సిండికేట్ కూడా మీ హక్కులను లాక్కోలేదు” అని మోదీ పేర్కొన్నారు.

# ఆర్టీసీ సమ్మెతో మెట్రో సేవలు

**హైదరాబాద్,** ఆర్టీసీ కార్మికుల సమ్మె పిలుపుతో నగరంలో ప్రజా రవాణాకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం , రవాణా సంస్థలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాయి. ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు అద్దె బస్సులను సిద్ధం చేయడంతో పాటు, మెట్రో రైళ్ల రాకపోకల వేగాన్ని గరిష్ట స్థాయికి పెంచారుఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రయాణికుల కోసం తొలి రోజు సుమారు 1000 బస్సులను అద్దె ప్రాతిపదికన సిద్ధం చేశారు. వీటిలో 480 ఎలక్ట్రిక్ బస్సులు, 250 అద్దె బస్సులు , 270 ఇతర బస్సులు ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిత్యం 30 లక్షల మంది ప్రజలు రవాణాపై ఆధారపడుతుండగా, సమ్మె కాలంలో రద్దీని తట్టుకోవడానికి కనీసం 2000 బస్సులు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఎల్బీ నగర్, ఉప్పల్, పటాన్ చెరు వంటి కీలక మార్గాల్లో అధిక సంఖ్యలో బస్సులు నడపాలని నిర్ణయించారు.ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేని తరుణంలో మెట్రో రైళ్లపై ఒత్తిడి పెరుగుతున్న దృష్ట్యా, హైదరాబాద్ మెట్రో రైల్ కీలక నిర్ణయం తీసుకుంది. రద్దీ సమయాల్లో ప్రయాణికులు ఎక్కువ సేపు నిరీక్షించకుండా ఉండేందుకు రైళ్ల మధ్య సమయాన్ని తగ్గించారు.రద్దీ వేళల్లో (ఉదయం 8:00 ? 10:30, సాయంత్రం 5:00 ? 8:00) ప్రతి 3 నిమిషాల 40 సెకన్లకు ఒక రైలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. నాన్–పీక్ అవర్స్‌లో కూడా ప్రతి 4 నిమిషాల 20 సెకన్లకు ఒక రైలును నడపనున్నారు. సమ్మె కాలం మొత్తం 56 మెట్రో రైళ్లు నిరంతరాయంగా సేవలు అందించనున్నాయి.నగరంలో ఎంఎంటీఎస్ సర్వీసులను కూడా పెంచితే సబర్బన్ ప్రయాణికులకు మరింత వెసులుబాటు కలుగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు , రోజూవారీ కూలీలకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అన్ని రవాణా మార్గాలను సమన్వయం చేస్తోంది.మియాపూర్ – ఎల్బీ నగర్ కారిడార్‌లో సాధారణంగా పీక్ అవర్స్‌లో 3 నిమిషాల 40 సెకన్లకు ఒక రైలు, నాన్–పీక్‌లో 4 నిమిషాల 50 సెకన్లకు ఒక రైలు. ఇప్పుడు రోజంతా 4 నిమిషాల 20 సెకన్లకు ఒక రైలుగా ఉంటుంది.నాగోల్–రాయదుర్గ్ కారిడార్‌లో సాధారణంగా నాన్–పీక్‌లో 5 నిమిషాల 20 సెకన్లకు ఒక రైలు. ఇప్పుడు రోజంతా 3 నిమిషాల 40 సెకన్లకు ఒక రైలు ఉంటుంది.సాధారణంగా వారపు రోజుల్లో ఉదయం 8 నుండి 10:30 వరకు, సాయంత్రం 5 నుండి 8 వరకు మాత్రమే 56 రైళ్లు నడిపేవారు. నాన్–పీక్ అవర్స్‌లో 44 రైళ్లకు తగ్గించేవారు. సమ్మె కారణంగా ఇప్పుడు ఆ తగ్గింపు ఉండదు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాత్రి 11 గంటల తర్వాత కూడా మెట్రో సర్వీసులు పొడిగించే అవకాశాన్ని మెట్రో అధికారులు పరిశీలిస్తున్నారు.

# డంపింగ్ యార్డ్కు వ్యతిరేకంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మహా పాదయాత్ర

**హుజురాబాద్** హుజురాబాద్లో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డ్ రద్దు కోసం కొనసాగుతున్న మహా పాదయాత్రలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొన్నారు. పోతిరెడ్డిపేట, వెంకట్రావుపల్లి, సిర్సపల్లి గ్రామాల మీదుగా హుజురాబాద్ అంబేద్కర్ విగ్రహం వరకు సాగిన ఈ పాదయాత్రకు గ్రామాల వారీగా అపూర్వ స్పందన లభించింది. పాదయాత్ర మార్గమంతా మహిళలు, రైతులు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు. ప్రజలు తమ సమస్యలను బహిరంగంగా వ్యక్తం చేస్తూ, డంపింగ్ యార్డు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తు కంటే ముఖ్యమైనది ఏదీ లేదని, ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా డంపింగ్ యార్డ్ ఏర్పాటు జరగనీయబోమని స్పష్టం చేశారు. ప్రజలతో కలిసి చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఈ డంపింగ్ యార్డు కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకొచ్చిందని, కాబట్టి అదే ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల ప్రయోజనాల కోసం అన్ని రాజకీయ పార్టీలు పార్టీ భేదాలు పక్కనపెట్టి ఈ ఉద్యమానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు.

# సేల్స్ టాక్స్ అధికారి ఇంటిపై ఏసీబీ దాడులు

**విజయవాడ** విజయవాడ గవర్నర్పేట సేల్స్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు జరిపింది. ఆఫీస్ సబార్డినేట్గా పనిచేస్తున్న కొండపల్లి శ్రీనివాసరావుపై ఏసీబీ కేసు నమోదు అయింది. కొండపల్లి శ్రీనివాసరావు ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న అభియోగంపై ఏసీబీ తనిఖీలు జరిపింది. శ్రీనివాసరావు కార్యాలయంతో పాటు.. విజయవాడ వన్టౌన్ పీఎస్ సమీపంలోని శ్రీనివాసరావు నివాసం, ఆయన సోదరుల ఇళ్లలోనూ ఏసీబీ సోదాలు జరిగాయి...

# మత్తోజిపేటలో ఉద్రిక్తత

**నర్సంపేట** ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ స్వగ్రామం నర్సంపేట మండలం మత్తోజిపేటలో ఉద్రిక్తత నెలకొంది. శంకర్ గౌడ్ మృతదేహాన్ని కడసారి డిపోకు తీసుకెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులను కుటుంబ సభ్యులు, కార్మికులు కోరారు. మరోవైపు, శంకర్ గౌడ్ నివాసానికి చేరుకునేందుకు ప్రయత్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేసారు. శంకర్ గౌడ్ నివాసం వద్ద కార్మికులు, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

# శంకర్ గౌడ్ మృతి పట్ల ఎంపి ఈటల సంతాపం

**సికింద్రాబాద్** నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మబలిదానం చేసుకోవడం తీవ్రంగా కలచివేసిందని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. . హక్కుల సాధనలో ఒక కార్మిక బిడ్డను కోల్పోవడం యావత్ సమాజానికి తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబానికినా ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. ఈటల మాట్లాడుతూ కార్మిక సోదరులారా.. ఆత్మహత్యలు ఏ సమస్యకూ పరిష్కారం కావు. మరణం నిశ్శబ్దాన్ని మిగిలిస్తుంది, కానీ మన పోరాటానికి కావాల్సింది సజీవమైన గొంతుక. మన పోరాటం గెలవాలంటే మనం సజీవంగా ఉండి పోరాడాలి. ప్రాణాలు తీసుకుని కుటుంబాలను అనాథలు చేయకండి, ధైర్యంగా ఉండి మన హక్కుల కోసం కలిసి పోరాడుదామని అన్నారు.పభుత్వం ఇప్పటికైనా తన మొండి వైఖరిని వీడాలి. శంకర్ గౌడ్ మరణానికి బాధ్యత వహిస్తూ, ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలి. లేని పక్షాన.. గత ప్రభుత్వానికి పట్టిన గతే మీకు పడుతుంది. ఇప్పటికైనా చర్చలు జరిపి, కార్మికులకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులను కల్పించాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు..

# నేరేడి ప్రాజెక్టు డీపీఆర్ రెడీ..

**శ్రీకాకుళం,** ఉత్తరాంధ్రవాసులు, ముఖ్యంగా శ్రీకాకుళ జిల్లావాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నేరడి బ్యారేజి నిర్మాణానికి ఇటీవల అడ్డంకులు తొలగిపోయాయి. ఏపీ ప్రభుత్వం నేరడి బ్యారేజీ నిర్మాణంపై ఫోకస్ పెట్టింది.. ఈ క్రమంలో తొలి అడుగు పడింది. తాజాగా నేరడి బ్యారేజీకి సంబంధించి రూ.70 కోట్లతో కొత్త డీపీఆర్ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. అలాగే ఒడిశా ప్రభుత్వానికి కూడా త్వరలో లేఖ రాయనున్నారు.శ్రీకాకుళంజిల్లా వాసుల ఎన్నో ఏళ్ల నిజం కాబోతోంది.. దాదాపు 65 ఏళ్ల తర్వాత కీలక ముందగుడు పడింది. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న నేరడి బ్యారేజీ నిర్మాణం కోసం కొత్త డీపీఆర్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. ఇటీవల వీడబ్ల్యూడీటీ (వంశధార నదీ జలాల వివాదాల ట్రైబ్యునల్) తీర్పుపై కేంద్రం గెజిట్ నోటిఫై చేసిన సంగతి తెలిసిందే.. దీంతో బ్యారేజీ నిర్మాణానికి లైన్ క్లియర్ అయ్యింది. దీంతో ఏపీ ప్రభుత్వం బ్యారేజ్ నిర్మాణంపై ఫోకస్ పెట్టింది. నేరడి బ్యారేజీ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోవడంతో కొత్త డీపీఆర్ తయారీ, సర్వే సహా ఇతర పనుల కోసం రూ.70 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

# మున్నూరు కాపు సంఘం బలోపేతం దిశగా ఐక్యంగా ముందుకు తీసుకెళ్తా

**-సంఘం జగిత్యాల జిల్లా బాధ్యులు : వారాల దేవయ్య**

**- మున్నూరు కాపు సంఘం జగిత్యాల జిల్లా ఇంచార్జిగా వారాల దేవయ్య నియామకం**



వేములవాడ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర సమావేశంలో జగిత్యాల జిల్లా ఇంచార్జిగా నియామక పత్రం అందుకున్న అనంతరం వేములవాడకు చెందిన వారాల దేవయ్య మాట్లాడుతూ సంఘం తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరు కాపు సమాజ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, జగిత్యాల జిల్లాలో కుల బాంధవులను ఐక్యంగా నిలబెట్టి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు. యువతను సంఘ కార్యకలాపాలలో భాగస్వామ్యం చేయడం, పాత తరం నాయకుల అనుభవాన్ని ఉపయోగించుకోవడం ద్వారా సమాజానికి సేవ చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.తనకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తమరావు, నాయకులు హజారీ రమేష్, మీసాల చంద్రయ్యలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, అందరి సహకారంతో జిల్లాలో సంఘాన్ని మరింత అభివృద్ధి చేస్తానని వారాల దేవయ్య స్పష్టం చేశారు.

# విలాసాగర్ గ్రామంలో సర్పంచ్ కనుకయ్య ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**- వేసవికాలం దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు గ్రామపంచాయతీ ముందడుగు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం,విలాసాగర్ గ్రామంలో ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య, ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ రాజు నాయకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో గ్రామ ప్రజలు, ప్రయాణికులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ సదుపాయం కల్పించినట్లు వారు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగుల కనకయ్య మాట్లాడుతూ, “ఎండలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామ ప్రజలు, ప్రయాణికులకు తాగునీరు అందుబాటులో ఉండడం చాలా అవసరం. అందుకే గ్రామపంచాయితీ తరఫున చలివేంద్రాన్ని ఏర్పాటు చేశాం. ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలి” అని తెలిపారు.గ్రామ ప్రజలు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామపంచాయితీ అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మిరుదొడ్డి శ్రీనివాస్‌తో పాటు వార్డు సభ్యులు దమ్మ వెంకట రమణ, జోగు శంకర్, కొంకటి సతీష్, గోల్కొండ సూరి, దయ్యాల రేణుక, సుంకపాక హేమలత, పోలె శేఖర్, పైండ్ల అనిల్ పాల్గొన్నారు. అలాగే యూత్ కాంగ్రెస్ నాయకులు ఏనుగుల ప్రశాంత్ కుమార్, మార్కెట్ డైరెక్టర్ కల్లేపల్లి సతీష్, ఏనుగుల అనిల్ కుమార్, గ్రామాధ్యక్షుడు సాగరం కనకయ్య, గ్రామ ప్రజలు హాజరయ్యారు.

# పేదింటి ఆడపడుచులకు కళ్యాణలక్ష్మీ పథకం ఒక ఆర్థిక భరోసా

**- కాంగ్రెస్ పార్టీ నాయకులు**

**- లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ**



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా,భీంగల్ మండలంలోని ముచ్కూర్ గ్రామంలో శుక్రవారం కళ్యాణ లక్ష్మీ పథకం కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ సర్పంచ్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సునుగూరు సుజాత, ములుగు సత్తవ్వలకు చెక్కులు అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకం పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థికంగా ఎంతో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెడ్డు అశోక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గట్టు మురారి, బాయికాడి రాజు, లింబాద్రి,గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తున్న విద్యా సంస్థలపై

# ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

**- ఏ.ఐ.ఎస్.బి. రాష్ట్ర ఉపాధ్యక్షుడు**

**- అతికం రాజశేఖర్ గౌడ్ డిమాండ్**




సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. విద్యాశాఖకు మంత్రిని కూడా నియమించలేని పరిస్థితి నెలకొనడం బాధాకరమని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పూర్తి ఫీజు చెల్లించకపోతే టీసీలు, మెమోలు ఇవ్వకపోవడం దారుణమని, దీనిపై విద్యాశాఖ స్పందించాలన్నారు. విద్యార్థుల సమస్యలపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టి, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు మెట్టు రాకేష్, జిల్లా నాయకులు సార్ల సతీష్, ఆడెపు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి సేవ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించిన: టిటిడి అదనపు ఈవో



తిరుమల (ప్రశ్న న్యూస్)శ్రీవారి సేవ కార్యకలాపాలపై టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి శుక్రవారం తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో గల సుధర్మ సమావేశం మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారి సేవకులకు సేవల కేటాయింపు, భక్తులకు సేవలు అందించే విధానంపై ముందస్తు శిక్షణ, సంబంధిత విభాగాల సిబ్బంది సేవకులతో నడుచుకోవాల్సిన విధానం, సేవకుల నుండి ఫిర్యాదులు అందితే తక్షణ పరిష్కారం వంటి అంశాలపై సమావేశంలో సమీక్షించారు. ఈ సమావేశంలో సీపీఆర్వో డాక్టర్ టి.రవి, డిప్యూటీ ఈవోలు లోకనాథం, భాస్కర్, సోమన్నారాయణ, ఎస్టేట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, రమాకాంత్, పీఆర్వో (ఎఫ్ఏసీ) కుమారి నీలిమ, ఐటీ డిప్యూటీ జీఎం వెంకటేశ్ నాయుడు, అశ్వనీ ఆసుపత్రి సివిల్ సర్జన్ డాక్టర్ సుబ్బారెడ్డి, వీజీవో సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 296వ జయంతి ఉత్సవాలు: టిటిడి



తిరుమల(ప్రశ్న న్యూస్) శ్రీ వేంకటేశ్వరస్వామికి అపర భక్తురాలు, భక్తకవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 296వ జయంతి ఉత్సవాలు ఏప్రిల్ 29, 30వ తేదీల్లో వైభవంగా జరుగనున్నాయి. వెంగమాంబ స్వస్థలమైన తరిగొండ, తిరుమల, తిరుపతి దివ్యక్షేత్రాలలో జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. తరిగొండ శ్రీ లక్ష్మీనృసింహస్వామివారి ఆలయంలో ఏప్రిల్ 30వ తేదీ ఉదయం 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలోని తరిగొండ వెంగమాంబ విగ్రహానికి పుష్పాంజలి కార్యక్రమాలు నిర్వహిస్తారు.సాయంత్రం 6 నుండి 9 గంటల వరకు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో వెంగమాంబ సంకీర్తనల గోష్ఠిగానం, హరికథ కార్యక్రమాలు జరుగనున్నాయి.తిరుమలలో ఏప్రిల్ 29, ఏప్రిల్ 30వ తేదీలలో ఉదయం 10 గంటలకు తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో సాహితీ సదస్సు జరుగనుంది. ఇందులో ప్రముఖ పండితులు పాల్గొని వెంగమాంబ రచనలపై ఉపన్యసిస్తారు. సాయంత్రం 6 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో గాత్ర సంగీత సభ, హరికథ గానం చేయనున్నారు.ఏప్రిల్ 30వ తేదీన ఉదయం 9 గంటలకు తిరుపతిలోని ఎం.ఆర్.పల్లి సర్కిల్ వద్దగల వెంగమాంబ విగ్రహానికి పుష్పాంజలి సమర్పిస్తారు. తిరుమలలో ఏప్రిల్ 30వ తేదీన సాయంత్రం 4.30 గంటలకు తిరుమలలోని వెంగమాంబ బృందావనంలో పుష్పాంజలి సమర్పిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు తిరుమలలోని నారాయణగిరి ఉద్యానంలోని శ్రీ పద్మావతి వేంకటేశ్వర పరిణయోత్సవ మండపంనకు ఉభయనాంచారీ సమేతంగా శ్రీవారు పురవీధుల గుండా వేంచేపు చేస్తారు. సాయంత్రం 6 నుండి 7.15 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు మరియు ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులచే తరిగొండ వెంగమాంబ సంకీర్తనల గోష్ఠిగానం నిర్వహిస్తారు. రాత్రి 7.15 గంటలకు పుష్పగిరి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యాశంకర భారతీస్వామి అనుగ్రహభాషణం చేయనున్నారు.

## కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామివారి బ్రహ్మోత్సవాలు



చిత్తూరు(ప్రశ్న న్యూస్) కీలపట్లలోని శ్రీ కోనేటిరాయస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఉదయం ధ్వజారోహణంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.05 నుండి 9.15 గంటల మధ్య మిథున లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించి, సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. గరుత్మంతుని చిత్రంతో అలంకరించిన ధ్వజపటానికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్చారణల మధ్య గరుత్మంతుని ప్రతిరూపాన్ని కొత్త వస్త్రంపై లిఖించి, పూజలు చేసి, ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. ముందుగా గ్రామ పొలిమేరలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించడం జరిగింది. శుక్రవారం రాత్రి 7 గంటలకు శేషవాహనంపై స్వామివారు ఊరేగి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

**ఆలయ ప్రాముఖ్యత**

కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామివారి ఆలయం ప్రముఖ పుణ్యక్షేత్రంగా భక్తుల ఆదరణ పొందుతోంది. స్థలపురాణం ప్రకారం బృగు మహర్షి స్వామివారిని సాలగ్రామ రూపంలో ప్రతిష్ఠించినట్లు చెబుతారు. ఈ ఆలయంలోని స్వామివారి విగ్రహం తిరుమల శ్రీవారి మూలవిరాట్‌ను పోలి ఉండటం విశేషం. భక్తులు స్వామివారిని దర్శించుకుంటే కోరికలు నెరవేరుతాయని విశ్వాసం. తాళ్లపాక అన్నమాచార్యులు ఈ క్షేత్రాన్ని దర్శించి సంకీర్తనలు ఆలపించినట్లు చారిత్రకంగా పేర్కొంటారు.2012 నవంబర్ 19న ఈ ఆలయం టిటిడిలో విలీనం అయిన తరువాత నిత్యకైంకర్యాలు, ఉత్సవాలు మరింత వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. ప్రతి శనివారం సుమారు 200 మంది భక్తులు తలనీలాలు సమర్పిస్తున్నారు. భక్తులకు నిత్యం అన్నప్రసాదాలు అందిస్తున్నారు.ప్రతి నెల శ్రవణ నక్షత్రం రోజున కళ్యాణోత్సవం నిర్వహిస్తారు. గృహస్థులు రూ.300 చెల్లించి ఈ సేవలో పాల్గొనవచ్చు. పౌర్ణమి పర్వదినాన ఊంజల్ సేవ కూడా భక్తి భావంతో నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో టిటిడి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, కంకణ బట్టార్ శ్రీకాంత్ ఆచార్యులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ మోహన రమణ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుడి ఆత్మబలిదానం ఘటనపై చంద్రమౌళి ఆగ్రహం

**- ఆత్మహత్యలు వద్దు - ఆర్టీసీ కార్మికులకు భాజపా అండ**

**- భాజపా సీనియర్ జిల్లా నాయకులు : అనుమల్ల చంద్రమౌళి**



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మబలిదానం ఘటనపై బీజేపీ కరీంనగర్ జిల్లా సీనియర్ నాయకుడు, కొత్తపల్లి మాజీ ఉప సర్పంచ్ అనుమల్ల చంద్రమౌళి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 22 ఏళ్లుగా సేవలందించిన శంకర్ గౌడ్ భౌతికకాయాన్ని నర్సంపేట డిపోలో సహచర కార్మికులు, కుటుంబ సభ్యులు కడసారి దర్శించుకునే అవకాశం ఇవ్వకపోవడం అమానుషమని విమర్శించారు. దుఃఖంలో ఉన్న వారిపై పోలీసులు వ్యవహరించిన తీరును ఖండించారు.ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఇటువంటి ఆత్మబలిదానాలు ఆగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేస్తూ, వారికి బీజేపీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.

# ప్రజాస్వామ్య పద్ధతిలో హిల్ట్ పాలసీ అమలు

**- క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**- నగరాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవడమే ప్రభుత్వ లక్ష్యం**

**- మే మొదటి వారం నుంచి సవరించిన భూముల మార్కెట్ విలువను అమలులోకి తీసుకురండి**

**- హిల్ట్ పాలసీని ఆహ్వానిస్తున్నాము: ఇండస్ట్రియల్ ఎస్టేట్స్ ప్రతినిధులు**



హైదరాబాదు(ప్రశ్న న్యూస్) నగరం తో పాటు, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ (హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ఫర్మేషన్) తీసుకువచ్చిందని, ఈ పాలసీని ప్రజాస్వామ్య పద్ధతిలో అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ రిసోర్స్ మొబ లైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో పాటు కమిటీ సభ్యులు, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావులు పాల్గొన్నారు. హిల్ట్ పాలసీపై సమీక్ష సమావేశంలో ఇండస్ట్రియల్ ఎస్టేట్స్ ప్రతినిధులు సైతం పాల్గొని వారి అభిప్రాయాలు తెలిపారు.ఎయిర్ పొల్యూషన్ ఇండెక్స్ గణనీయంగా పెరిగిపోతున్న తరుణంలో కాలుష్యకారక పరిశ్రమలు అన్నిటిని ఓ ఆర్ ఆర్ అవతలికి తరలించాలని కంపల్సరీ చేస్తే అందరూ వెళ్ళిపోతారని కొందరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ల ప్రతినిధులు స్వయంగా చెప్పినప్పటికీ, మేం అందరి అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు పోతున్నామని డిప్యూటీ సీఎం వివరించారు. యూ డి ఎల్ (అన్ డెవలప్డ్ ల్యాండ్) పాలసీ కింద భూములను అభివృద్ధి చేసే కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, ఇండస్ట్రియల్ పార్కుల ప్రతినిధులు కలిసి అభివృద్ధి చేసుకునే ఆలోచన చేయాలి అన్నారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఉన్నతాధికారులు శశాంక, కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల సొంత ఇంటి కళను నెరవేర్చడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చింది

**మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ మండలం శివాయపల్లి గ్రామంలో శుక్రవారం పండుగ వాతావరణంలో లబ్ధిదారుల ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో కలెక్టర్. పాల్గొన్నారుఇందిరమ్మ గృహాన్ని కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల సంక్షేమ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు జరుగుతున్నాయని ఈ కార్యక్రమంలో భాగంగా శివాయపల్లి గ్రామంలో ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు తోట లక్ష్మి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని తెలిపారు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపక్కాగాపారదర్శకంగాజరుగుతుందన్నారు సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారికి మొదటి ప్రాధాన్యతగా గుర్తించి వారికి ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మల నిర్మాణం కోసం ప్రభుత్వం విడుదలవారీగా నిధులు విడుదల చేస్తున్నారు. ఒక్కో గృహ నిర్మాణానికి ఐదు లక్షలు అందించడం జరుగుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలనిసూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 750 ఇందిరమ్మ ఇండ్లు పూర్తయ్యాయని, మిగిలిన వారు కూడా త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 650 ఇండ్లు గృహప్రవేశాలు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, హౌసింగ్ పీడీ మాణిక్యం, సర్పంచ్ అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన

**మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రైతులు తమ పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. నిర్వాహకులతో మాట్లాడుతూ రైతులకి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేయాలి అన్నారు. సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ అందించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుల నుండి కటింగుల పేరిట కొనుగోలు సెంటర్లలో ధాన్యంను నిలువు దోపిడి చేశారని అన్నారు.రైతు సమస్యల విషయంలో తాను ఏనాడు రాజీ పడేది లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి గింజ కొనుగోలు చేస్తాం...కొనుగోలు పూర్తయిన వెంటనే ఒకటి రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. చేస్తోందని చెప్పారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్,గౌరీశంకర్, పంచాయతీ కార్యదర్శి రమేష్, మహేశ్వరి, నర్సింలు, ఉప్ప సర్పంచ్, వార్డు సభ్యులు, ఐకేపీ సభ్యులు, నాయకులు,రైతులు, తదితరులు పాల్గొనారు.

## వైద్య రత్న అవార్డు అందుకున్న డాక్టర్ రోజా రాణి



గజ్వేల్(ప్రశ్న న్యూస్) హైదరాబాదులోని రవీంద్రభారతిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈఎన్టీ స్పెషలిస్ట్ డాక్టర్ రోజా రాణి "వైద్య రత్న" అవార్డును అందుకున్నారు. హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్, రాందేవ్ రావ్ ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్ రాందేవ్ రావ్ చేతుల మీదుగా ఆమెకు ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ మాట్లాడుతూ, చెవి-ముక్కు-గొంతు వైద్యశాస్త్రంలో దాదాపు పదేళ్ల అనుభవంతో రోగులకు నాణ్యమైన సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించినందుకు గుర్తింపుగా ఈ అవార్డు అందజేశామని తెలిపారు.డాక్టర్ రోజా రాణి మాట్లాడుతూ, ఈ అవార్డు తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని, దీనితో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. పేదలకు సాధ్యమైనంత వరకు వైద్య సహాయం అందిస్తూ సేవలు కొనసాగిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, పబ్బ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సాఫీగా నిర్వహించుకోవాలి...

**- ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న**

మంథని( ప్రశ్న న్యూస్) రైతులకు అందుబాటులో గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సాఫీగా నిర్వహించుకోవాలని మంథని ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంథని మండలం గద్దలపల్లి లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి ప్రారంభించగా, ఆరెంద,నాగెపల్లి,బిట్టుపల్లి, గోపాల్ పూర్, చిన్న ఓదాల కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచులు జాడి రామస్వామి, గుమ్మడి సమ్మయ్య, పోగుల లావణ్య -- మహేందర్, నాగుల శారద -- రాజయ్య, మేడ రాజయ్య, టి.సుజాత- తిరుపతి లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న మాట్లాడుతూ తమ కాంగ్రెస్ ప్రభుత్వంలో గింజ కటింగ్ లేకుండా చివరి గింజ వరకు వరి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రైతు పక్షపాతిగా వ్యవహరిస్తుందని అన్నారు. ఈ రబీ



సీజన్ లో ఆయకట్టు చివరి భూముల వరకు కెనాల్ వాటర్ అందించడం జరిగిందని అన్నారు. రైతు సంతోషమే మా సంతోషమని అన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు సాదుల శ్రీకాంత్, నాయకులు ఎరుకల ప్రవీణ్, కుర్మశెట్టి సతీష్, కోరవేని కుమార్, ముతినేని నరేష్, గువ్వల రాయమల్లు, గువ్వల రమేష్, చిలువేరి మల్లేష్, పోగుల సాగర్,తోట మల్లయ్య, వేల్పుల శ్రీనివాస్, కొమ్మిడి శ్రీనివాస్,



రెండ్ల కృష్ణమూర్తి, కొండ మహేందర్, సిరిముర్తి ఓదెలు, వేముల శ్రావణ్, మోతుకు బాపు, దాసరి రమాదేవి, చంద్రు రాజమల్లు,కొప్పుల రాజయ్య, నాయకులు, రైతులు, హమాలి సంఘం నాయకులు, సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రుద్రంగిలో ఆధునిక పోలీస్ స్టేషన్‌కు డీజీపీ శివధర్ రెడ్డి శ్రీకారం

- వేములవాడలో ట్రాఫిక్,మహిళా పోలీస్ స్టేషన్ల మంజూరుకు డీజీపీ హామీ
- సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలుకు డీజీపీ కృషి
- "అరివ్ - అలైవ్"తో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు - తెలంగాణ రాష్ట్ర డీజీపీ : బి. శివధర్ రెడ్డి
- ప్రజల భద్రతలో పోలీసుల పాత్ర కీలకం - రాష్ట్ర ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్



రుద్రంగి / వేములవాడ (ప్రశ్న న్యూస్) ప్రజలకు మరింత చేరువగా ఉండే పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డీజీపీ బి. శివధర్ రెడ్డి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా, రుద్రంగి మండల కేంద్రంలో రూ.2.50 కోట్లతో నిర్మించనున్న నూతన ఆధునిక పోలీస్ స్టేషన్ భవనానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి గితే పాల్గొన్నారు. శంకుస్థాపన అనంతరం డీజీపీ మాట్లాడుతూ ప్రజలకు అనుకూలంగా, పారదర్శకంగా సేవలు అందించేలా పోలీస్ వ్యవస్థలో మార్పులు తీసుకొస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, అందులో భాగంగా 'అరైవ్.. అలైవ్' కార్యక్రమం ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి



ఆలయానికి వచ్చే భక్తుల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు అవసరమని పేర్కొంటూ, భీమారంలో కూడా పోలీస్ స్టేషన్ మంజూరుకు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.అనంతరం ఎమ్మెల్యే,విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రుద్రంగి పోలీస్ స్టేషన్ మంజూరు చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి సహకారం ఉందని తెలిపారు. ప్రజల భద్రతకు పోలీసులు నిరంతరం సేవలు అందిస్తున్నారని కొనియాడారు. జిల్లాలో డ్రగ్స్ నిర్మూలన, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ కొత్త పోలీస్ స్టేషన్ ద్వారా సేవలు మరింత మెరుగవుతాయని తెలిపారు. ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ రుద్రంగిలో నేరాల నియంత్రణకు ఆధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ బలోపేతం చేసినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కన్నాల శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయానికి సౌండ్ సిస్టం వితరణ

**సర్పంచ్ గుడిసె గట్టయ్య.**



మంథని (ప్రశ్న న్యూస్) మంథని మండలంలోని కన్నాల గ్రామంలో భక్తుల పాలిటి కొంగు బంగారం గా పూజలు అందుకుంటూ కొలువైన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారికి కన్నాల గ్రామానికి చెందిన కీర్తిశేషులు ముసుకుల రాఘవరెడ్డి జ్ఞాపకార్థంగా వారి మనుమడు అమెరికాలో ఉంటున్న ముసుకుల రమేష్ రెడ్డి సౌండ్ సిస్టం విరాళంగా అందజేశారు సర్పంచ్ గట్టయ్య అడిగిన వెంటనే 50 వేల రూపాయల విలువ చేసే సౌండ్ సిస్టంవిరాళం అందజేసినందుకు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య ఉప సర్పంచ్ గాదె దివ్యసంజీవ రెడ్డి గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు ముసకుల రమేష్ రెడ్డి కుటుంబంపై ఆ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దీవెనలు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జీడిమెట్ల డిపో ముందు ధర్నా

**మేడ్చల్** జీడిమెట్ల బస్ డిపో ముందు ఆర్.టిసి కార్మికులు తలపెట్టిన ధర్నా కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేకానంద, బిఆర్ఎస్ నేతలతో కలిసి సంఘీభావం ప్రకటించి, ప్రభుత్వ మొండి వైఖరీ తో ఆత్మహత్య చేసుకున్న ఆర్టిసి డ్రైవర్ శంకర్ గౌడ్ కు నివాళులు అర్పించి మౌనం పాటించారు. తరువాత ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్.టిసి డిమాండ్ లు న్యాయమైన డిమాండ్లు అన్నారు .. గత ప్రభుత్వ హయంలో బిఆర్ఎస్ పార్టీ సియం కేసిఆర్ ఆర్.టిసి ని ప్రభుత్వంలో విలీన ప్రక్రియ గెజిట్ ను రీలీజ్ చేశారని, కానీ ఇప్పటి కాంగ్రెస్ రేవంత్ సర్కార్ ఖీఅ అమలు ప్రక్రియను కావాలనే నిర్లక్ష్యం చేస్తూ కార్మిక,కర్షకులతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు..గతంలో రేవంత్ రెడ్డి ఆర్టీసి అంశంలో డిజిల్ పై జిఎస్టీ ఎత్తివేస్తేనే సంవత్సరానికి700 కోట్ల లాభం చేకూరుతుందని చెప్పి దాని అమలును అడ్డుకుని ఆర్టిస్టు కార్మికులతో,కుటుంబాలతో ఆడుకుంటూ ఆర్టీసీకి చెల్లించాల్సిన బకాయిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు.. రాష్ట్రంలో ఆర్.టిసి కార్మికులు,ప్రభుత్వ ఉద్యోగులు,రైతులు,మహిళలు, యువత ఇలా ఏ ఒక్కరు రాష్ట్ర ప్రభుత్వం పట్ల సంతోషంగా లేరన్నారు.. ఇవ్వాల్సిన బకాయిలు అడిగితే మీరు పీక్కుతిన్న నా దగ్గర ఒక్క రుపాయి లేదని అబద్ధాలు మాటలతో కాలం వెల్లదీస్తూ, హైదరాబాద్ లో లేని నగరం సృష్టించేందుకు వేలకోట్లు,మూసి ప్రక్షాళన పేరిట 1.50లక్షల కోట్లు వెచ్చిస్తూ తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

కాంగ్రెస్ సర్కార్ లో రేవంత్ రెడ్డి తన సీటు కాపాడుకునేందుకు ఇప్పటికే 70సార్లు డిల్లీకి మూఠాలు మోస్తూ తన సియం సీటును కాపాడుకుంటూ తను మోజుపడ్డ మిస్ యూనివర్స్ అందాల పోటీలు,తన మోజు తీర్చుకునేందుకు మెస్సీతో కలిసి ఆడే ఫుట్ బాల్ ఆటలకు 100ల కోట్లు వెచ్చిస్తున్నారే తప్ప కార్మికులు,కర్షకులు,రైతుల పట్ల ఏమాత్రం ప్రేమ లేదని విమర్శించారు..ఏదేమైనా భారతదేశంలోని అన్ని రాష్టాల్లో సియం హోదాలో ఘోరంగా విఫలమైన సియం గా అఫఖ్యాతిని మూటగట్టుకున్నాడు రేవంత్ రెడ్డి అంటూ మండిపడ్డారు..

## దిల్ సుఖ్ నగర్ డిపో వద్ద ఉద్రిక్తత

**హైదరాబాద్** దిల్ సుఖ్ నగర్ డిపో ముందు ఉద్రిక్తత నెలకొంది. ఆర్టీసి డ్రైవర్ శంకర్ గౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పించేందుకు వచ్చిన ఆర్టీసి కార్మికులను పోలీసులు అడ్డుకున్నారు. డిపో ముందే చేస్తామని కార్మికులు. రోడ్ పక్కకు చేసుకోవాలని పోలీసులు పట్టు పట్టారు. దాంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది.

## ఆర్టీసీ డ్రైవర్ పై చెప్పుతో కొట్టిన మహిళ.

బస్సు ఆపలేదనే కారణంతో ఆర్టీసీ డ్రైవర్ పై మహిళ చెప్పుతో కొట్టిన ఘటన మోపిదేవిలో శుక్రవారం చోటు చేసుకుంది.సేకరించిన వివరాల మేరకు అవనిగడ్డ నుంచి విజయవాడ వెళుతున్న కరకట్ట బస్సును పులిగడ్డ వంతెనపై మహిళ బస్సు ఎక్కడానికి ఆపింది. కానీ బస్సు ఆపకుండా డ్రైవర్ వెళ్లిపోయాడు. దీంతో మహిళ బస్సును వెంబడిస్తూ, మోపిదేవి ప్రధాన సెంటర్లో బస్సు ఎక్కి, డ్రైవర్ ను చెప్పుతో చెంప మీద కొట్టింది.

అంతటితో ఆగని సదరు మహిళ తన బంధువులకు ఫోన్ చేసి చల్లపల్లి బస్ స్టాప్ కు పిలిపించి వారితో డ్రైవర్ ను కొట్టించింది. దీంతో బస్ స్టాప్ లో కొద్దిసేపు ఆర్టీసీ ఉద్యోగులు, మహిళకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.మహిళకు బంధువైన ఒక కానిస్టేబుల్ సదరు గొడవలో ఎంటరై, పంచాయితీ స్టేషన్ వరకు వెళ్లకుండా సర్దుబాటు చేశారు.బస్సు ఆపనంత మాత్రాన డ్రైవర్ ను కొడతారా....... కొట్టిస్తారా....... అంటూ ఉద్యోగులు వాపోతున్నారు.

## శ్రీ భీమేశ్వర స్వామివారి సేవలో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంను డీజీపీ శివధర్ రెడ్డి శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.డీజీపీ ఆలయ వసతి గృహానికి చేరుకోగానే పోలీస్ బృందం గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ ఆనర్) సమర్పించింది. అనంతరం ఆలయంలోకి ప్రవేశించిన ఆయనకు అర్చకులు, వేద పండితులు స్వస్తి వాచకంతో ఘన స్వాగతం పలికారు.తరువాత స్వామివారి మండపంలో అర్చకులు, వేద పండితులు తీర్థ ప్రసాదం అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ డీఈఓ భాస్కర శర్మ స్వామివారి శేష వస్త్రం, లడ్డూ ప్రసాదం,చిత్రపటాన్ని డీజీపీకి అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే, వేములవాడ ఆర్డీఓ రాధాబాయి,వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు, ఆలయ ఏఈఓ జి. అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పుడమి తల్లి పిలుపు - విత్తనం నాటుదాం, జీవం నిలుపుదాం

## ఒక ప్రకృతి ప్రేమికుని హృదయం నుండి వెలువడిన ఆవేదన సందేశం






ఆకాశం మేఘాలు కదుతోంది... మనం ఏం చేస్తున్నాం.?ఆకాశంలో మేఘాలు క్రమంగా కూడుకుంటున్నాయి. వేసవి వేడిమి తగ్గుతోంది. గాలిలో చిరు చల్లదనం తొంగిచూస్తోంది. మరో నలభై రోజుల్లో వర్షాకాలం మన గడపను తడుతుంది. ఆకాశం తన వంతు బాధ్యత నిర్వర్తించడానికి సిద్ధమవుతోంది.

కానీ మనం.? చెట్లు నరికాం. అడవులు తగలబెట్టాం. నేలను సిమెంటుతో కప్పేశాం. ఆకాశాన్ని పొగతో నింపాం. ఇప్పుడు వర్షం పడినా నేల మింగుకోవడం లేదు. వరదలు వస్తున్నాయి, మరుసటి నెలకే కరువు వస్తోంది. ఢిల్లీలో ప్రజలు మాస్క్ ధరించి బయటికి వస్తున్నారు. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తేనెటీగలు, సీతాకోకచిలుకలు, ఉడతలు, పక్షులు ఒక్కొక్కటిగా మాయమవుతున్నాయి. ఈ పరిస్థితి మనం తెచ్చుకున్నదే. మార్పు కూడా మనం మాత్రమే తేగలం. ఈ సందేశం ఒక్క పర్యావరణవేత్త కోసం కాదు. ఒక్క ప్రభుత్వ శాఖ కోసం కాదు. ఇది మీ కోసం, మీ ఇంట్లో, మీ వీధిలో, మీ చేతుల్లో జీవాన్ని నింపుకోగలిగిన ప్రతి సాధారణ మనిషి కోసం.

### విత్తనం, ప్రకృతి మనకిచ్చిన అద్భుత బహుమతి

ఒక మర్రిచెట్టు గురించి ఆలోచించండి. ఆ మహావృక్షం ఒక్కోసారి వేల పళ్ళను ఇస్తుంది. ప్రతి పండులో ఒక్క గింజ. ఆ గింజ మొలకెత్తితే మళ్ళీ ఒక మహావృక్షం. శాస్త్రవేత్తలు లెక్కించారు. ఒక్క మర్రిచెట్టు విత్తనాలన్నీ మొలకెత్తితే భారతదేశంలో ప్రతి ఇంటికి ఒక చెట్టు వస్తుందట! ఇది అతిశయోక్తి కాదు. ఇది ప్రకృతి దాతృత్వానికి నిదర్శనం.మనం ఆ దాతృత్వాన్ని అర్థం చేసుకోలేదు. పండు తిని గింజ పడేశాం. తరం తరం గా ఇదే చేశాం. ఇప్పుడు ఒక్కసారి ఆగి ఆలోచిద్దాం, ఆ గింజను పడేయకుండా నేలలో పెడితే ఏం జరుగుతుంది?మనం తింటున్న ప్రతి పండు మనకొక సందేశం పంపుతోంది. "నన్ను వ్యర్థం చేయకు, నేల అమ్మకు అప్పగించు!"

### మృగశిర కార్తె, పుడమి తల్లి శుభముహూర్తం

మన పూర్వీకులు ఊరికే రుతువులు పాటించలేదు. వారికి తెలుసు, ఏ విత్తనం ఏ సమయంలో నాటాలో, ఏ నేల ఏ మొక్కను ఇష్టపడుతుందో.జూన్ మొదటి వారంలో మృగశిర కార్తె మొదలవుతుంది. ఇది ప్రకృతి మనకు ఇచ్చిన పవిత్ర సమయం. ఈ రోజు నేల సిద్ధంగా ఉంటుంది. మట్టిలో తేమ ఉంటుంది. సూర్యుని వేడి సరిగ్గా ఉంటుంది. విత్తనం నాటితే మొలకెత్తే అవకాశం అత్యధికంగా ఉంటుంది. ఇది మన పండుగ కాదు. ఇది పుడమి తల్లి పండుగ.

జూన్ 12 లోపు మీ విత్తనాలు సిద్ధం చేసుకోండి. ఆ తేదీ వరకు మనకు సరిగ్గా నలభై రోజులు ఉన్నాయి. ఈ నలభై రోజులు వృథా చేయకండి.

ఇప్పటి నుండే చేయవలసిన పనులు మొదటి అడుగు, విత్తనాల సేకరణ మీ వంటింటే మీ నర్సరీ. రేపటి నుండే మొదలుపెట్టండి.

పండ్ల విత్తనాలు..

మామిడి గింజలు, సీతాఫలం గింజలు, సపోటా గింజలు, దానిమ్మ గింజలు, నేరేడు గింజలు, రేగు గింజలు --- ఇవన్నీ ఒక పళ్ళెంలో ఆరబెట్టి, గాలి తగిలే నీడలో దాచిపెట్టండి.

**కూరగాయల విత్తనాలు:**బీర గింజలు, దోస గింజలు, కాకర గింజలు, సొర గింజలు, టమాటా గింజలు, మిరప గింజలు --- ఇవి మీ పెరట్లో, కాలనీ గోడవారన, ఖాళీ స్థలంలో నాటవచ్చు.

### ఔషధ మొక్కల కొమ్మలు..

తిప్పతీగ కొమ్మ విసిరితే చాలు మొలకెత్తుతుంది. ఇన్సులిన్ ప్లాంట్, బ్రహ్మకమలం, అడ్డసరం, రణపాల ఆకు, ఒక్క ముక్క, ఒక్క కొమ్మ చాలు, అవే పెరుగుతాయి.

### రెండవ అడుగు, విత్తన బంతులు తయారు చేయడం

ఇది జపాన్ వ్యవసాయ శాస్త్రవేత్త మసనోబు ఫుకుఓకా పద్ధతి, చాలా సరళంగా ఉంటుంది.కావలసినవి: స్థానిక మట్టి, కంపోస్ట్ లేదా మట్టి ఎరువు, వివిధ విత్తనాలు, కొద్దిగా నీళ్ళు.

### చేసే విధానం..

మట్టి మూడు భాగాలు, కంపోస్ట్ ఒక భాగం కలపండి. లోపల విత్తనాలు ఉంచి చిన్న బంతిగా చుట్టండి. నీడలో ఆరబెట్టండి. బంతి గట్టిపడిన తర్వాత సిద్ధం.

**వాడే విధానం:** వర్షం మొదలైనప్పుడు రోడ్డు పక్కన, అడవి అంచులో, కొండ వాలుల్లో, నదీతీరంలో విసిరేయండి. వర్షానికి బంతి కరిగి విత్తనాలు నేలలో చేరతాయి. వాటికి కాపలా అక్కర్లేదు. ప్రకృతే చూసుకుంటుంది.

### మూడవ అడుగు, అంతరించిపోతున్న చెట్లను నాటండి

ఒకప్పుడు మన గ్రామాల చుట్టూ ఎంతటి దట్టమైన అడవులుండేవి! రావి చెట్టు కింద పెద్దలు కూర్చునేవారు. మర్రి చెట్టు నీడలో పిల్లలు ఆడుకునేవారు. జువ్వి చెట్టుకు పక్షులు గూళ్ళు కట్టేవి.

ఇవి ఇప్పుడు ఎక్కడున్నాయి.?

### నాటవలసిన వృక్ష జాతులు..

రావి చెట్టు --- 24 గంటలూ ఆక్సిజన్ ఇస్తుంది. పక్షులకు ఆహారం.

మర్రి చెట్టు --- వందల ఏళ్ళు జీవిస్తుంది. వందల జీవులకు ఆశ్రయం.

జువ్వి --- నీటి ఊటలు పెరగడానికి దోహదం చేస్తుంది.

వేప --- ఔషధ గుణాల ఖజానా. గాలిని శుద్ధి చేస్తుంది.

పొగడ --- రాత్రి పూట అద్భుతమైన సువాసన. తేనెటీగలకు ఆహారం.

తమల పాకు, తిప్పతీగ, అడ్డసరం, మన సంప్రదాయ ఔషధాలు. ఇవి ఒకసారి నాటితే పశువులు ముట్టుకోవు. అవే పెరుగుతాయి. మళ్ళీ చూడాల్సిన అవసరం లేదు. కానీ అవి మీకు, మీ పిల్లలకు, మీ మనవళ్ళకు నీడ, ఆక్సిజన్, వర్షం, ఆరోగ్యం ఇస్తాయి.

### ఎవరు ఏం చేయాలి.?

ఇంటి మహిళలు మీరు ప్రతిరోజూ వంటకు పండ్లు, కూరగాయలు వాడతారు. ఆ గింజలు పడేయకండి. వారానికి ఒకసారి మీ ఇంటి పెరట్లో, బాల్కనీలో, కుండీలో నాటండి. మీరు ఇంటి నుండే అడవిని పెంచగలరు.పిల్లలు మీకు ఒక్క పని అప్పగిస్తున్నాం, ఈ వర్షాకాలంలో ఒక విత్తనం నాటండి. దానికి నీళ్ళు పోయండి. అది పెరిగే వరకు చూసుకోండి. అది మీ జీవితకాలపు స్నేహితుడు అవుతుంది.యువకులు మీ ఊరిలో, మీ కాలనీలో ఒక "హరిత బృందం" ఏర్పరచండి. నర్సరీ నుండి మొక్కలు తెచ్చి సామూహికంగా నాటండి. సోషల్ మీడియాలో వీడియో పెట్టండి. మిగతావాళ్ళను ప్రేరేపించండి.

కాలనీ సంఘాలు ప్రతి కాలనీలో ఒక "విత్తన బ్యాంకు" తెరవండి. వారానికి ఒకసారి అందరూ కలిసి దగ్గరలో ఉన్న ఖాళీ స్థలంలో మొక్కలు నాటండి.

విద్యా సంస్థలు ప్రతి పాఠశాలలో, కళాశాలలో ఒక ఔషధ మొక్కల తోట ప్రారంభించండి. విద్యార్థులకు విత్తన బంతులు తయారుచేయడం నేర్పించండి. ఇది పాఠ్యపుస్తకం కంటే గొప్ప పాఠం.స్వచ్ఛంద సంస్థలు గ్రామాల చుట్టూ పెద్ద వృక్షాల పెంపకం ప్రణాళిక రూపొందించండి. అంతరించిపోతున్న వృక్షజాతుల విత్తనాలు సేకరించి పంపిణీ చేయండి.ప్రభుత్వ శాఖలు,అటవీ శాఖ, పంచాయతీ రాజ్, పట్టణ ప్రణాళిక శాఖలు --- మృగశిర కార్తె నాటడాన్ని అధికారిక కార్యక్రమంగా ప్రకటించండి. నర్సరీల ద్వారా ఉచితంగా మొక్కలు పంపిణీ చేయండి

### సంఖ్యలు మాట్లాడుతున్నాయి

హైదరాబాద్ నగర జనాభా సుమారు కోటి. ఒక్కొక్కరు ఒక్క మొక్క నాటితే కోటి మొక్కలు. ఒక్కొక్కరు పది మొక్కలు నాటితే పది కోట్ల మొక్కలు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కలిపి దాదాపు ఐదు కోట్ల కుటుంబాలు. ఒక్కో కుటుంబం ఒక్క మొక్క నాటితే ఐదు కోట్ల మొక్కలు ఒక్క సీజన్‌లో!

ఇది అసాధ్యమా.? కాదు. అసాధారణమా.? చాలా సాధారణం. అయితే ఇది అత్యవసరమా.? అత్యంత అవసరం.

### మనం ఏం పోగొట్టుకుంటున్నాం.?

ఒక తేనెటీగ మాయమైతే, పంటలు పండవు.

ఒక సీతాకోకచిలుక మాయమైతే, పరాగ సంపర్కం ఆగిపోతుంది.

ఒక పక్షి మాయమైతే, కీటకాల జనాభా విపరీతంగా పెరుగుతుంది.

ఒక చెట్టు నరికితే , వందల జీవులు నిరాశ్రయులవుతాయి.

మనం ఇప్పుడు అనుభవిస్తున్నది ఇదే. ఢిల్లీలో ఆక్సిజన్ సిలిండర్లు అమ్ముతున్నారు. పంజాబ్‌లో భూగర్భ జలాలు అడుగంటాయి. బెంగళూరులో నీటి కోసం గొడవలు జరిగాయి. రాజస్థాన్ ఎడారి పెరుగుతోంది. ఇది అక్కడి సమస్య కాదు, ఇది మన రేపటి నిజం.

రేపు ఆక్సిజన్ సిలిండర్ వీపుకు కట్టుకుని తిరగాల్సిన పరిస్థితి రాకముందే మేల్కొందాం.

### ఒక్క మొక్క ఇచ్చే సంపద..

ఒక్క వేప చెట్టు తన జీవితకాలంలో దాదాపు ఒక లక్ష రూపాయల విలువైన ఆక్సిజన్, నీటి నిల్వ, నేల సంరక్షణ, ఔషధ విలువను అందిస్తుంది. మనం దానికి ఏమి ఇస్తాం? కేవలం ఒక్క విత్తనం. కొద్దిగా నీళ్ళు. ఇంత చిన్న పెట్టుబడికి ఇంత పెద్ద రాబడి మరే వ్యాపారంలోనూ లేదు.

### హరిత ప్రతిజ్ఞ, మీరు చేయగలరా.?

నేడు, ఈ క్షణం, మీరు ఒక ప్రతిజ్ఞ చేయండి,"నేను ఈ వర్షాకాలంలో కనీసం ఒక్క మొక్క నాటుతాను. దాన్ని రక్షిస్తాను. నా పరిసరాల్లో మరొకరికి కూడా ఈ సందేశం చేరవేస్తాను."

ఇది చాలు. ఈ ఒక్క ప్రతిజ్ఞ చాలు. పార్కుకి వెళ్ళినప్పుడు ఒక మొక్క నాటి రండి. నర్సరీ దగ్గర పది రూపాయలకు దొరికే మొక్కను కొని ఎక్కడైనా నాటి రండి. విత్తన బంతులు చేసి అడవి అంచులో విసిరి రండి. మీరు చేసే ఆ ఒక్క పని మీ తర్వాత తరాలకు వారసత్వంగా మిగులుతుంది. మన పూర్వీకులు పెట్టిన చెట్ల పండ్లు మనం తిన్నాం. మనం పెట్టే చెట్లు మన మనవళ్ళు తింటారు. ఈ గొలుసు తెంచుకుంటే, మనల్ని మనమే నాశనం చేసుకున్నట్టే.

### సందేశం అందజేయండి

ఈ సందేశాన్ని మీ వాట్సాప్ గ్రూపులో పంచండి. ఫేస్‌బుక్‌లో షేర్ చేయండి. మీ కాలనీ నోటీస్ బోర్డులో అతికించండి. మీ పక్కింటివారికి చెప్పండి. ఒక్కో చేయి ఒక్కో మొక్క నాటితే, ఈ దేశం మళ్ళీ పచ్చగా మారుతుంది.ప్రకృతి మనల్ని అడుగుతోంది. సమాధానం మన చేతుల్లో ఉంది.

**మీ సింహాచలం లక్ష్మణస్వామి, ప్రకృతి ప్రేమికులు, కవి, రచయిత ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నారపల్లి హైదరాబాద్ నుండి**
**9908289830**

# ఆర్టీసీ కార్మికుల సమ్మె పై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

- డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి
- ఆత్మహత్యలు వద్దు.. పోరాడి సాధించుకుందాం
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- కార్మికుల సమ్మెకు మద్దతుగా సిపిఐ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో



**హనుమకొండ :** ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని,సమ్మె పై మొండి వైఖరి వీడాలని,ఈ విషయంలో సమ్మెపై ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు హనుమకొండలోని కాళోజి సెంటర్ లో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో కార్మికుల పక్షాన నిలబడి పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆర్టీసీ కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు.ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఆగిపోయిన రెండు వేతన సవరణలను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. కార్మికుల ఐక్య పోరాటంతోనే హక్కుల సాధన సాధ్యం అని, సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ప్రైవేటు డ్రైవర్ల ప్రయోగం ప్రజల ప్రాణాలతో చెలగాటమేనని, సమ్మెను అణచివేసేందుకు ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెడుతున్న ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని అన్నారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, ఉద్యోగ భద్రత, వేతన సవరణ, ఖాళీ పోస్టుల భర్తీ, కార్మికులకు సంబంధించిన సంక్షేమ చేశారు గత ఎన్నికల సందర్భంగా రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, అదేవిధంగా ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రెషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఆర్టీసి కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని, ఆత్మహత్యలు పరిష్కారం కాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఎన్ ఎ స్టాలిన్, వుట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఎదునూరి వెంకట్రాజం, కొట్టేపాక రవి, వేల్పుల సారంగపాణి, గుంటీ రాజేందర్, అలువాల రాజు, పొనుగోటి రామ్ గోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, మామునూరి దామోదర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## వేములవాడ రాజన్న ఆలయంలో..

# డీజీపీ ప్రత్యేక పూజలు



**వేములవాడ** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని డీజీపీ శివధర్ రెడ్డి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.డీజీపీ ఆలయ వసతి గృహానికి చేరుకున్న వెంటనే పోలీస్ బృందం గౌరవ వందనం గార్డ్ ఆఫ్ ఆనర్, సమర్పించింది. అనంతరం ఆలయంలోకి ప్రవేశించిన ఆయనకు ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి వాచకంతో ఘనంగా స్వాగతం పలికారు.తరువాత స్వామివారి మండపంలో అర్చకులు వేద పండితులు తీర్థ ప్రసాదం అందజేసి ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ డీఈఓ భాస్కర శర్మ స్వామివారి శేష వస్త్రం,లడ్డు ప్రసాదం చిత్రపటాన్ని డీజీపీకి అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ శ్రీ మహేష్ బి గీతే, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు, ఆలయ ఏఈఓ జి. అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి సబిత అరెస్టు

**జనగామ** ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ రెచ్చగొట్టే విధానం వల్ల నర్సంపేటలో ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ పార్థివ దేహానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వెళ్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎంపీలు వినోద్ కుమార్, మాలోత్ కవిత లను పోలీసులు అరెస్టు చేసి జనగాం రూరల్ పోలీస్ స్టేషన్ తరలించారు. వారిని వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి నిరసనకు దిగారు.

## ఈ రోల్ మ్యాపింగ్‌లో

# సహకరించండి

## - ఓటర్లను కోరిన తహసీల్దార్



**చుంచుపల్లి** మండలంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ) భారత్ ఎన్నికల సంఘం ద్వారా కార్యక్రమం అమలు జరుగుతోందని చుంచుపల్లి తహసీల్దార్ కూచిపూడి నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ) తమ పరిధిలోని ఓటర్ల వివరాలను సమగ్రంగా పరిశీలించి "ఈ-రోల్ మ్యాపింగ్" ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. ఈ ప్రక్రియలో భాగంగా 2002 ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకుని ప్రతి ఓటరు వివరాలను నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే, ప్రతి కుటుంబానికి సంబంధించిన సభ్యుల వివరాలను కుటుంబ మ్యాపింగ్ కింద నమోదు చేయడం కూడా ఈ కార్యక్రమంలో ముఖ్య భాగమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని ప్రజలందరూ తమకు సంబంధించిన బిఎల్ఓలను సంప్రదించి తమ ఓటరు వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు సక్రమంగా నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ కోరారు. ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొనడం ద్వారా భవిష్యత్ ఎన్నికల కోసం ఖచ్చితమైన ఓటరు జాబితా సిద్ధం కావడానికి సహకారం అందిస్తారని చెప్పారు. చుంచుపల్లి మండల పరిధిలోని 18 పంచాయతీలలో ఉన్న 41 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఓటర్లు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వార్డ్ సభ్యులు ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని ప్రతి ఓటరు ఈ రోల్ మ్యాపింగ్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు.

# శంకర్ గౌడ్‌ది ప్రభుత్వ హత్యే

**హుస్నాబాద్** ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం దీక్ష చేపడుతున్న సమయంలో అద్దె బస్సులు నడపడానికి అధికారులు బయటకు పంపుతుండగా శంకర్ గౌడ్ కు ఆర్టీసీ అధికారులకు వాగ్వాదం జరగడంతో అధికారులు దూషించడం మూలంగానే శంకర్ గౌడ్ మనస్తాపం చెంది ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నారని సిద్దిపేట జిల్లా మోకు దెబ్బ జన హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ గౌడ్ అన్నారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసుకోవడంతో పాటు అందులో పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. శంకర్ గౌడ్ ఆత్మ హత్యకు కారకులైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు కోటి రూపాయల ఎక్స్రేషియా ప్రభుత్వం చెల్లించాలని, ఆర్టీసీ ప్రతినెల మహాలక్ష్మి పథకం కింద 300 కోట్ల రూపాయలు ఆర్టీసీకి చెల్లిస్తున్నందున సంస్థ లాభాల్లో నడుస్తుందని మంత్రులు డంక బజాయిస్తున్నారని, అలాంటప్పుడు పదవి విరమణ పొందిన కార్మికులకు వారికి రావాల్సిన బకాయిలు చెల్లించకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. శంకర్ గౌడ్ కు న్యాయం జరిగే వరకు పోరాడుతామని హెచ్చరించారు.

## ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముందు

# బీజేపీ నాయకుల ధర్నా

**వికారాబాద్** వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముందు బీజేపీ నాయకులు ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి ఘటనపై ధర్నా నిర్వహించారు. శంకర్ గౌడ్ మృతి ఆత్మహత్య కాదు, ప్రభుత్వ హత్య అని ఆరోపిస్తూ ప్రభుత్వం వెంటనే దిగివచ్చి ఆర్టీసీ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లే ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నాయని విమర్శించారు. శంకర్ గౌడ్ కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నా ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. దీంతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## హనీ ట్రాప్ కేసు : నిందితులు కోర్టుకు



**అనంతపురం** హనీ ట్రాప్ కేసులో అరెస్ట్ అయిన నలుగురిని పోలీసులు కోర్టు లో హాజరు పరిచారు. ఏ 2 రాజేష్ తో సహా మిగిలిన మహిళలను అరెస్ట్ చేసి కోర్టు కు తరలించారు. అరెస్టుల సంఖ్య ఐదుగురికి పెరిగింది. మాజీ ఉపసర్పంచ్ నరేంద్ర రెడ్డి అరెస్ట్ కూడా త్వరలో చూపించే అవకాశం వుంది.

### మాజీ ఎంపివిజయసాయి రెడ్డి ఇంట్లో

# ఈడీ సోదాలు



**హైదరాబాద్** ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఇడి తనిఖీలు మరోసారి జరిగాయి. జూబ్లీహిల్స్ లోని మాజీ ఎంపి విజయసాయి రెడ్డి నివాసంలో సోదాలు జరిగాయి. శుక్రవారం నాడు ఈడీ అధికారులు విజయసాయిరెడ్డిని ప్రశ్నించారు. లిక్కర్ స్కామ్ కేసులో కీలక ఆధారాలు సేకరిస్తున్నారు. 2019-24 మధ్య లిక్కర్ పాలసీలో అవకతవకలు వున్నట్లు కేసు నమోదయింది. షెల్ కంపెనీల ద్వారా మనీలాండరింగ్, డబ్బు మళ్లింపు, ఇతర ఆర్థిక లావాదేవీలపై ఆరా తీసినట్లు సమాచారం.

## ప్యూటీ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ పదవికి రాజీనామా..

డిప్యూటీ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ దేవరకొండ ప్రసాద్ సంచలన ప్రెస్ మీట్.ఏపీ డీజీపీ ఇచ్చిన మెమోకి లిఖితపూర్వకంగా వివరణ ఇచ్చి అనంతరం తన డి.ఎస్.పి గా పనిచేస్తున్న పోలీస్ ఉద్యోగానికి రాజీనామా చేశారు.విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్లో తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డు వ్యవహారంపై తుళ్లూరు పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన ఫిర్యాదు పై ఎటువంటి చర్యలు తీసుకోలేదు అని ఆ ఫిర్యాదులో వివరాలను మీడియాకు వివరిస్తూ తన పదవికి రాజీనామా చేశారు.

### నైపుణ్యాభివృద్ధి, ఉపాధి పథకాలపైన

# శిక్షణ తరగతులు



**సిద్ధిపేట** ప్రతి ఒక్క విద్యార్థి తమలోనీ నైపుణ్యాలను గ్రహించి విద్యా మరియు ఎంచుకున్న రంగం లో ఉపాధి అవకాశాలను సాధించి ఉన్నతంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ సంక్షేమ శాఖల విద్యార్థులకు జిల్లా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి పథకాలపైన జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శిక్షణ తరగతులను నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక- 99 రోజుల కార్యాచరణ ప్రక్రియలో భాగంగా సంక్షేమ వారోత్సవాలలో యువత కోసం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి, వారిలో ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ప్రభుత్వం అనేక పథకాలు తీసుకువచ్చిందని తెలిపారు.జిల్లాలో బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ సంక్షేమ గురుకులాల్లో విద్యను అభ్యసిస్తున్న మీరందరూ ఈ నైపుణ్య అవగాహన సదస్సులో 10వ తరగతి తర్వాత ఏది చదవాలి తొందరగా ఉపాధి కల్పించడానికి ఎలాంటి నైపుణ్యాలను అలవర్చుకోవాలని పూర్తి సమాచారాలను ఇక్కడ మీకు అందించడం జరుగుతుందనీ ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో సిద్దిపేట, కుకునూరు పల్లి, దుబ్బాక లో ఐటిఐ లలో యువతకు ఉపాధి అందించేందుకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ప్రారంభించి కొత్త కోర్సులను తీసుకువచ్చింది కొత్తగా హుస్నాబాద్ లో సైతం ఐ టి ఐ సెంటర్ మంజూరు అయిందని వచ్చే అకడమిక్ ఇయర్ వరకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు.అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో చేరడం ద్వారా తక్కువ సమయంలో మంచి ఉపాధి పొందవచ్చని ఇందులో ఇంజనీరింగ్ వాళ్లకు లేనన్ని ఉపాధి అవకాశాలు ఈ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలోను విద్యార్థులకు లభిస్తాయని సూచించారు. 10 వ తరగతి తర్వాత ఇంటర్ డిగ్రీ లాంటి కోర్సులు కాకుండా నైపుణ్య రంగంలో త్వరగా ఉపాధి కల్పించుకోవడం కోసం అనేక కోర్సులు ఉన్నాయని, ఉద్యోగ అవకాశాలు తోపాటు పై చదువులు చదువుకునేందుకు సైతం ఈ కార్యక్రమంలో క్లుప్తంగా తెలుసుకోవాలని సూచించారు.టెక్నికల్ స్కిల్స్ నేర్చుకుని పట్టణాల్లో సైతం పలు కోర్సులు పూర్తిచేసి ఉపాధి పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, జిఎం ఇండస్ట్రీస్ గణేష్ రామ్, డిడబ్ల్యుఓ శారద, డిబిసిడిఓ సయ్యద్ రఫీ, డిఎస్సీడిఓ హమీద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి విజయ్ భార్గవ్, ఇర్కోడ్ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ రామానుజ, అడిషనల్ డిఆర్డీఓ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్: ఎమ్మెల్యే నసీర్

### అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

### గుంటూరు తూర్పులో ప్రజా దర్బార్, అర్జీలు స్వీకరణ

గుంటూరు (ప్రశ్న న్యూస్) ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే అవకాశం ప్రజాదర్బార్ ద్వారా కలిగిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. జగన్ ప్రభుత్వంలో సెంటు స్థలం ఇచ్చామని పట్టా చేతిలో పెట్టారు కానీ స్థలం ఎక్కడ ఉందో చూపించ లేదని, రేషన్ కార్డులు, పింఛన్లపై ఎమ్మెల్యే నసీర్ కు అర్జీలు అందజేశారు. వివిధ సమస్యలపై అర్జీలు దాఖలు కాగా కొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే నసీర్ ఫోన్ లో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు చేపడతామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. త్వరలో గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని భరోసా కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందని, పెద్ద ఇల్లు ఉందని, ఇలా ఏవేవో కుంటిసాకులు చెప్పి పింఛన్లు, రేషన్ కార్డులకు ఎగనామం పెట్టారని తెలిపారు. దీంతో ప్రజాదర్బార్ లో ఎక్కువ శాతం పింఛన్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వస్తున్నాయని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పింఛన్ పెంచితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వెయ్యి రూపాయలు పెంచామని తెలిపారు. రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల ద్వారా ఐదు రూపాయలకే కడుపు నిండా ఆహారం పెట్టే గొప్ప పథకానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. అగ్గిపెట్టెలులాంటి సెంటు భూమి ఇచ్చి నిరుపేదల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేసి ప్రజలతో శభాష్ అనిపించుకున్నారని వివరించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కేవలం 18 నెలల కాలంలోనే మెగా



జాబ్ మేళా ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించామని, ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే సంకల్పంతో పని చేస్తున్నామని చెప్పారు. ఏ సమస్య వచ్చినా గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు

# మామిడి పండ్లతో రక్తపోటుకు చెక్

### - కానీ ఈ జాగ్రత్తలు తీసుకుంటేనే మేలు

వేసవి వచ్చిందంటే చాలు, మామిడి పండ్ల సీజన్ మొదలైనట్టే. పండ్ల రారాజుగా పిలుచుకునే మామిడిని ఇష్టపడని వారు చాలా అరుదు. అయితే, రక్తపోటు (బీపీ) సమస్య ఉన్నవారు మామిడి పండ్లు తినొచ్చా? లేదా? అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే రక్తపోటును అదుపులో ఉంచుకోవడం చాలా ముఖ్యం. మరి ఈ విషయంలో మామిడి పండు ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలుసుకుందాం.

నిపుణుల ప్రకారం మామిడి పండ్లు రక్తపోటును నియంత్రించడంలో సానుకూల పాత్ర పోషిస్తాయి. వీటిలో అధికంగా ఉండే పొటాషియం, శరీరంలో సోడియం స్థాయిలను సమతుల్యం చేస్తుంది. ఇది రక్తనాళాల గోడలపై ఒత్తిడిని తగ్గించి, అవి రిలాక్స్ అయ్యేలా చేస్తుంది.

ఫలితంగా రక్తపోటు అదుపులోకి వస్తుంది. ఇటీవల జరిగిన కొన్ని అధ్యయనాల్లో మామిడి పండు తిన్న రెండు గంటల్లోనే సిస్టోలిక్ రక్తపోటులో స్పష్టమైన తగ్గుదల కనిపించినట్లు తేలింది.

### - గుండె ఆరోగ్యానికి మామిడి

మామిడిలో పొటాషియంతో పాటు మెగ్నీషియం, మాంగిఫెరిన్ అనే ప్రత్యేక యాంటీఆక్సిడెంట్, ఫైబర్ వంటి ఎన్నో ముఖ్య పోషకాలు ఉంటాయి. మెగ్నీషియం రక్తనాళాలు సక్రమంగా పనిచేయడానికి సహాయపడితే, మాంగిఫెరిన్ గుండె కణాలను ఆక్సీకరణ ఒత్తిడి నుంచి కాపాడుతుంది. ఇక ఫైబర్ శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండెపై భారాన్ని తగ్గిస్తుంది.

### - ఈ జాగ్రత్తలు తప్పనిసరి



మామిడి పండ్లతో ఇన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ, వాటిని మితంగా తీసుకోవడం చాలా అవసరం. ఎందుకంటే వీటిలో సహజ చక్కెరలు అధికంగా ఉంటాయి.

- ఒకేసారి ఎక్కువ తినకుండా, రోజుకు ఒక మీడియం సైజు మామిడి పండుకు పరిమితం చేసుకోవడం మంచిది.
- మామిడి పండు తిన్నప్పుడు, రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా ఉండేందుకు వాటిని నట్స్ వంటి ప్రోటీన్లు లేదా ఆరోగ్యకరమైన కొవ్వులతో కలిపి తినడం మేలు.
- ప్యాక్ చేసిన జ్యూస్‌లు, సిరప్‌లకు బదులుగా తాజా పండును తినడానికే ప్రాధాన్యత ఇవ్వాలి. దీనివల్ల పూర్తి ఫైబర్ ప్రయోజనాలు అందుతాయి.
- ముఖ్యంగా ఇప్పటికే రక్తపోటు, మధుమేహం లేదా ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఆహారంలో మార్పులు చేసుకునే ముందు తప్పనిసరిగా వైద్యులను లేదా డైటీషియన్‌ను సంప్రదించాలి.

మొత్తం మీద సమతుల్య ఆహారంలో భాగంగా మామిడి పండ్లను తెలివిగా, మితంగా ఆస్వాదిస్తే రక్తపోటు నియంత్రణతో పాటు ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చు.

# ఆత్మహత్యలొద్దు.. తెగించి పోరాడుదాం

**- ఆర్టీసీ కార్మికులతో తగవుపెట్టుకుంటే పతనం తప్పదు - యూనియన్లంటే పాలకులకు భయమెందుకు**

**- ప్రజారవాణాను ప్రైవేటీకరించేందుకు ప్రభుత్వం కుట్ర - చట్టపరమైన సమ్మెపై నిర్బంధాలు ఆపండి**

**- డిమాండ్లు పరిష్కరించేవరకు ఆర్టీసీ కార్మికులకు అండగా ఉంటాం - శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి**

**- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**కొత్తగూడెం** సమస్యల పరిష్కారం కోసం ప్రాణాలు తీసుకోవద్దని, ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదని, తెగించి పోరాడి హక్కులను సాధించుకుందామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బస్టాండ్ ఔట్ గేట్ నుంచి ఇన్ గేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించి బస్టాండు రోడ్డుపై ధర్నా చేపట్టారు. ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వానికైనా పతనం తప్పదని, ఆర్టీసీ కార్మికులతో తగవుపెట్టుకోవడం పాలకుల వినాశనానికి నాంది పలికే ప్రమాదం ఉందని, గత ప్రభుత్వ తప్పిదమే ప్రస్తుత ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. కార్మిక యూనియన్లంటే పాలకులకు ఎందుకు అంత భయమని, హక్కుల కోసం పోరాడే గొంతులను నొక్కేయాలని చూడటం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. ప్రజారవాణా వ్యవస్థను నిర్వీర్యం చేసి, కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, అందులో భాగంగానే ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.

ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేత, గుర్తింపు సంఘం ఎన్నికలు, వేతన సవరణ, పనిభద్రత, బకాయిలు, పనిభద్రత, కొత్తబస్సుల కొనుగోలు తదితర డిమాండ్లు ప్రభుత్వానికి సాధ్యం కానివికాదని పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ చట్టబద్ధంగా సమ్మె చేస్తుంటే అరెస్టులు, అక్రమ నిర్బంధాలు ఎందుకు విధిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకుండా రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను తీసుకొస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి, సమ్మెను నివారించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు తాము ఆర్టీసీ కార్మికులకు పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కార్మికుడు శంకర్ గౌడ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, తక్షణమే ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలు పెరిగే కొద్దీ ఉద్యమం మరింత ఉధృతమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, మిర్యాల రంగయ్య, ఎస్ కె ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు వంగ వెంకట్, కె రత్నకుమారి, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, రమణమూర్తి,, నాయకులు ఎర్రబెల్లి శంకర్, గుమ్మడెల్లి దుర్గయ్య, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, యూసుఫ్, సత్యనారాయణాచారి, షాహీన్, కైసర్, మేదిని లక్ష్మి, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీకి మద్దతుగా గజ్వేల్ నుండి పాదయాత్ర



**గజ్వేల్( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ రాష్ట్ర జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ నెల 25వ తేదీ శనివారం నాడు స్థాపించబోయే నూతన రాజకీయ పార్టీని స్వాగతిస్తూ, గజ్వేల్ నియోజకవర్గ యువతీ యువకులు భారీ పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. గజ్వేల్ నుండి బయలుదేరిన యువతకు తెలంగాణ రాష్ట్ర జాగృతి ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు కొట్టాల యాదగిరి పూర్తి సంఘీభావం ప్రకటించారు. యువతతో కలిసి ఆయన స్వయంగా పాదయాత్రలో పాల్గొని వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా కొట్టాల యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, అణగారిన వర్గాల గొంతుకగా శ్రీమతి కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించడం శుభపరిణామం. గజ్వేల్ నియోజకవర్గ యువత ఈ మార్పును స్వాగతిస్తూ స్వచ్ఛందంగా పాదయాత్ర చేపట్టడం అభినందనీయం. కొత్త పార్టీ స్థాపనతో రాష్ట్ర రాజకీయాల్లో నూతన అధ్యాయం మొదలవుతుంది, అని ధీమా వ్యక్తం చేశారు. ఈ పాదయాత్రలో ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన అశోక్ కనకసేన కనకయ్య తో పాటు నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులు, పార్టీ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంటలను వెంటనే కొనుగోలు చేయాలి: వంటేరు ప్రతాప్ రెడ్డి



**గజ్వేల్( ప్రశ్న న్యూస్ )** గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు తీసుకువచ్చిన పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంటలను వెంటనే కొనుగోలు చేయాలని బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డును బిఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించిన ఆయన, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నెల రోజులుగా పంటలతో మార్కెట్ యార్డులో ఎదురుచూస్తున్నామని, అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ప్రతాప్ రెడ్డి, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఎండలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. దళారుల చేతిలో రైతులు క్వింటాలుకు ?1000 నుంచి ?2000 వరకు నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే మద్దతు ధరలతో పంటలను కొనుగోలు చేయాలని, లేకపోతే రైతులతో కలిసి ధర్నాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్ పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్పర్సన్ పద్మాబాయి నర్సింగరావు, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, మాజీ జెడ్పిటిసి బొల్లారం ఎల్లయ్య, పంగ మల్లేశం, అర్జున్ గౌడ్ రాణి సత్యనారాయణ గౌడ్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ జక్యూద్దీన్ ,కౌన్సిలర్ బొగ్గుల స్వప్న సురేష్, గోలి మమతా సంతోష్, మామిడి శ్రీధర్, కాముని మురళి, కోట బాబు, కనక సేన, కప్పు మమత సంతోష్, సీనియర్ నాయకులు ఆకుల దేవేందర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, పొట్టోళ్ళ శ్రీనివాస్,అబ్దుల్, ఉమర్, స్వామి చారి, బలమణి శ్రీనివాస్ రెడ్డి, కరీం, పుల్ల బీరయ్య, బాలచంద్రం, రవీందర్ రెడ్డి బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులున్నారు.

## కార్మికుల ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలి: వంటేరు ప్రతాప్ రెడ్డి



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతికి నైతిక బాధ్యత వహిస్తూ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ పట్టణంలో ఆర్టీసీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొండివైఖరికి నిరసనగా చేపట్టిన ఈ ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం గజ్వేల్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని, సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడంలో విఫలమైందని విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో నర్సంపేట డిపోలో శంకర్ గౌడ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మరణించడం దురదృష్టకరమన్నారు. శంకర్ గౌడ్ కుటుంబానికి రూ. 1 కోటి ఎక్స్గ్రేషియా, కుటుంబ సభ్యునికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే చర్చలు ప్రారంభించి, మేనిఫెస్టో హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్ పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్పర్సన్ పద్మాబాయి నర్సింగారావు, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాస శ్రీనివాస్, గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, మాజీ జెడ్పిటిసి బొల్లారం ఎల్లయ్య, పంగ మల్లేశం, అర్జున్ గౌడ్ రాణి సత్యనారాయణ గౌడ్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ జక్యూద్దీన్ ,కౌన్సిలర్ బొగ్గుల స్వప్న సురేష్, గోలి మమతా సంతోష్, మామిడి శ్రీధర్, కాముని మురళి, కోట బాబు, కనక సేన, కప్పు మమత సంతోష్, సీనియర్ నాయకులు ఆకుల దేవేందర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, పొట్టోళ్ళ శ్రీనివాస్,అబ్దుల్, ఉమర్, స్వామి చారి, బలమణి శ్రీనివాస్ రెడ్డి, కరీం, పుల్ల బీరయ్య, బాలచంద్రం, రవీందర్ రెడ్డి బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఆర్టీసీ జేఏసీ సంఘం నాయకులు కార్మికులు , పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**- వాసవి మాత జయంతిని రాష్ట్ర వేడుకగా ప్రకటించడంపై ఆర్యవైశ్యుల హర్షం**



**గజ్వేల్(ప్రశ్న న్యూస్)** కన్యాకా పరమేశ్వరి వాసవి మాత జయంతిని తెలంగాణ రాష్ట్ర అధికారిక వేడుకగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్యవైశ్య సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు, నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్య గారి శేఖర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏ ఎం సీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ ,కొమరవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, సిద్ది బిక్షపతి, ఏర్రం శ్రీనివాస్ పాల్గొని వారు మాట్లాడుతూ వాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం ద్వారా ఆర్యవైశ్యులకు ముఖ్యమంత్రి సముచిత గౌరవం కల్పించారని నాయకులు కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని కులాలకు, వర్గాలకు న్యాయం జరుగుతుందని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ధీమా వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యుల చిరకాల కోరికను నెరవేర్చినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు , ఆర్యవైశ్య సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ 141వ మే డే విజయవంతం చేయండి: శివలింగ కృష్ణ




**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో మార్కెట్ కమిటీ హమాలి కార్మికులతో కలిసి ప్రపంచ 141వ మే డే సందర్భంగా వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు నిరంతరం పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు. అలాగే మే డేను పండుగ వాతావరణంలో జెండా ఆవిష్కరణతో ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా కౌన్సిల్ సభ్యులు శివలింగ కృష్ణ, సీపీఐ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం, గజ్వేల్ మార్కెట్ కమిటీ హమాలి అధ్యక్షుడు చింత శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయం: డాక్టర్ అజయ్ కుమార్



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని తెలంగాణ వైద్య విధాన పరిషత్ (సెకండరీ హెల్త్ కమిషనర్) డాక్టర్ అజయ్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాస్పిటల్ ప్రాంగణం, ఓపీ విభాగం, ఇన్‌పేషెంట్ వార్డులు, ప్రసూతి విభాగం, అత్యవసర విభాగం, ల్యాబ్, ఫార్మసీ వంటి విభాగాలను సమగ్రంగా పరిశీలించారు. హాస్పిటల్‌లో పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, శానిటేషన్ ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని ఆయన సూచించారు. రోగులు ఆసుపత్రికి వచ్చినప్పటి నుంచి చికిత్స పూర్తయ్యే వరకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, వ్యర్థాలను వేర్వేరు రంగుల బిన్‌లలో వేరు చేసి నిబంధనల ప్రకారం సురక్షితంగా పారవేయాలని చెప్పారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవలు, మందుల లభ్యత, వైద్య పరికరాల వినియోగం, శుద్ధమైన తాగునీరు, సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా ఉన్నాయని ఆయన అభినందించారు. గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి కార్పొరేట్ స్థాయి సేవలను అందిస్తున్నదని, ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోగులు, వారి బంధువులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సహాయక సిబ్బంది మర్యాదపూర్వకంగా స్పందించాలని, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డాక్టర్ అజయ్ కుమార్ స్పష్టం చేశారు. సేవల మెరుగుదలతో ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, ఆర్ఎంవోలు డాక్టర్ రాజేష్, డాక్టర్ ప్రణీతి, సీనియర్ అసిస్టెంట్ సతీష్, నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ, ఫార్మసీ అధికారులు విమల, శ్రీనివాసచారి, మోహన్ బండారి, శానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మి, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సింగ్ ఆఫీసర్ మెహరాజ్ భాను తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) మేడ్చల్ రజక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పంజాగారి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా చెలిమే శ్రీనివాస్, జనరల్ సెక్రటరీగా గుండ్రం రాజశేఖర్, సంయుక్త కార్యదర్శిగా సాధమని శ్రీనివాస్, ట్రెజరర్ గా చెలిమే ప్రవీణ్, ఎన్నికయ్యారు. సలహాదారులు గా పంజాగారి సుదర్శన్, పెడిశెట్టి బాలరాజు, చెలిమే రాందాస్, సాదమాని యాదగిరి, పంజాగారి మల్లేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజక సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

## ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**- ఆర్టీసీ విలీనం హామీ మరిచారా? - ఆర్టీసీ కార్మికులకు మా సంపూర్ణ మద్దతు**

**- ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి కడారి రాములు**




**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలో ఆర్టీసీ కార్మికుల సమ్మె శుక్రవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ కొనసాగుతున్న ఈ సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు నేతృత్వంలో సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కడారి రాములు మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేస్తామని, కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పడం అన్యాయమని విమర్శించారు. తక్షణమే ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలి



**తార్నాక(ప్రశ్న న్యూస్)** తెలంగాణ జన సమితి పార్టీ నాల్గవ రాష్ట్ర ప్లీనరీని విజయవంతం చేయాలని జనసమితి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. ప్లీనరీ కి సంబంధించిన గోడ పత్రికను విద్యార్థి జన సమితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద ఆవిష్కరించారు. ఓయూ కమిటీ చెరుకు శివరాజ్, రమేష్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్ కుమార్ హాజరై మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం లో తన వంతు పాత్ర పోషించిన ప్రొఫెసర్ కోదండరాం రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఉద్యమ ఆకాంక్షల సాధనకై ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు ఏర్పాటు చేసిన తెలంగాణ జన సమితి పార్టీ నాల్గవ ప్లీనరీ మే 12 వ తేదీన హైదరాబాద్ లోని జలవిహార్ లో జరుగుతుందని తెలిపారు. ఈ ప్లీనరీలో రాష్ట్రంలోని విద్యార్థుల యొక్క స్కాలర్షిప్, ఫీ రియంబర్స్మెంట్ తదితర విద్యా సమస్యలపై చర్చించడంతోపాటు రాష్ట్రంలోని వివిధ సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ ప్లీనరీలో మేధావులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జన సమితి రాష్ట్ర కార్యదర్శి మాలోత్ రవి కుమార్, రాష్ట్ర కార్యదర్శి జిల్లా పెల్లి దిలీప్ కుమార్ , విద్యార్థి జనసమితి ఓయూ నాయకులు, ఎల్లేష్, ముసేబ్, రిషి, యాకూబ్, అయూబ్, శివ, సాయికుమార్, అమృత, అక్షిత, యామిని, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల రక్తం తాగే కార్పొరేట్ 'మృత్యుశాలలు' ఇంకెన్నాళ్ళు..?

- శ్రీ చైతన్య పాఠశాలను వెంటనే సీజ్ చేయండి
- ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు బానోత్ దుర్గాప్రసాద్ నాయక్ డిమాండ్
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న జిల్లా అధికారుల తీరు
- పేద విద్యార్థికి న్యాయం చేసే అధికారులే లేరా జిల్లాలోలి
- లక్షల్లో జీవితాలు తీసుకుంటూ కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలి



**ఖమ్మం (ప్రశ్న న్యూస్)** విద్యా కుసుమాలను వికసింపజేయాల్సిన పాఠశాలలే నేడు పసిప్రాణాలను బలితీసుకుంటున్న మృత్యుశాలలుగా మారుతుంటే, జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయం. పదో తరగతి విద్యార్థి అప్పం నితీష్ ప్రాణాలను బలిగొన్న లక్ష్మీదేవిపల్లి శ్రీ చైతన్య పాఠశాలను తక్షణమే సీజ్ చేయాలని, ఆ పాఠశాల గేట్లకు తాళం వేయాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు బానోతు దుర్గాప్రసాద్ నాయక్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఒక పేద విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే, చట్టం తన పని తాను చేయాల్సింది పోయి.. కార్పొరేట్ శక్తుల కాళ్ల దగ్గర మోకరిల్లడం ప్రజాస్వామ్యానికే అవమానంఅధికారులు ఇప్పుడైనా కళ్లు తెరవండిజిల్లా కలెక్టర్, ఎస్పీ ఒక్కసారి ఆలోచించండి, చనిపోయింది మీ ఇంట్లోని బిడ్డ అయితే ఇలాగే మౌనంగా ఉండేవారా కార్పోరేట్ వ్యవస్థ ముందు పేదవాడి ప్రాణం అంత చులకనగా కనిపిస్తోందా నితీష్ మరణానికి కారణమైన ఆ పాఠశాలను వెంటనే సీజ్ చేయాలి మా ఓపికను పరీక్షించకండి ప్రజాస్వామ్య పద్ధతిలో మేము చేస్తున్న ఈ పోరాటం రేపు ఉగ్రరూపం దాల్చితే, కొత్తగూడెం వీధుల్లో జనాగ్రహ జ్వాలలు ఎగిసిపడతాయి. మా బిడ్డల ప్రాణాలతో వ్యాపారం చేస్తామంటే చూస్తూ ఊరుకోం నితీష్ ఆత్మకు శాంతి కలగాలంటే.. ఆ పాఠశాల మూతపడాల్సిందే, బాధ్యులు జైలు ఊచలు లెక్కపెట్టాల్సిందే.

# సీఎం రేవంత్ నిర్ణయాలపై మంత్రుల ఆగ్రహం

- రేవంత్ రెడ్డి పై జగ్గారెడ్డి పరోక్ష వ్యాఖ్యలు
- ఆర్టీసీ సమ్మె వద్దని సీఎంకు చెప్పిన వినలేదని పొన్నం అలక
- రైతుబంధుపై మంత్రి తుమ్మల మాటలు వినడం లేదన్న విమర్శలు
- సినిమాటోగ్రఫీలో రోహిన్ రెడ్డి పై కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆగ్రహం
- దేవాదాయ శాఖలో శంకుస్థాపనకు కొండా సురేఖకు అందని ఆహ్వానం
- కాంగ్రెస్ పార్టీ మంత్రులు ఎమ్మెల్యేలలో ముఖ్యమంత్రిపై అంతర్గత విమర్శలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మళ్లీ మంటలు రేపుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు పార్టీ లో అంతర్గతంగా తీవ్ర అసంతృప్తికి దారితీస్తున్నాయన్న చర్చలు గట్టిగా వినిపిస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన కొద్ది కాలానికే నేతల మధ్య సమన్వయం లోపించడం, కీలక అంశాల్లో పరస్పర విరుద్ధ ధోరణులు బయటపడటం కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తుపై అనేక సందేహాలు రేకెత్తిస్తున్నాయి.ప్రత్యేకంగా ఆర్టీసీ అంశంలో ప్రభుత్వం తీసుకున్న వైఖరిపై ప్రజల నుండి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి బహిరంగంగానే స్పందిస్తూ పరోక్షంగా సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలను ప్రశ్నించడం గమనార్హం. ఆర్టీసీ సమ్మె పరిస్థితి ఇంత తీవ్రంగా కావడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆయన వ్యాఖ్యలు పార్టీలో చర్చనీయాంశమయ్యాయి. అంతేకాకుండా కేబినెట్ సమావేశంలో కూడా ఆర్టీసీతో చర్చలు జరపాలని పొన్నం ప్రభాకర్ సీఎం రేవంత్ పై ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం.

దానితో కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అనేక విభేదాలు ఉన్నాయని కొంతమంది ప్రజాప్రతినిధులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.రైతుబంధు వ్యవహారం కూడా అంతర్గత విభేదాలకు వేదికైంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో సీఎం రేవంత్ రెడ్డి మధ్య పలుమార్లు ఘర్షణలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే అక్కసుతో ప్రభుత్వ ప్రకటనలలో తుమ్మల ఫోటోను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలగించారని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మంత్రులపై ఈ పరిణామాలు మంత్రివర్గంలో పరస్పర అవిశ్వాసానికి నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇంకా సినిమాటోగ్రఫీ శాఖలో సీఎం రేవంత్ రెడ్డి జోక్యం కూడా వివాదాస్పదంగా మారింది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన శాఖలో జోక్యంపై తీవ్ర అసంతృప్తితో దూరంగా ఉంటున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. అయితే సీఎం సన్నిహితుడు రోహిన్ రెడ్డి నే అనధికారికంగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారన్న ఆరోపణలు జోరుగా వినిపించడం పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మారుస్తోంది.దేవాదాయ శాఖ విషయంలో కూడా ఉద్రిక్తతలు పెరిగాయి. తాజా దేవాలయ అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాలకు మంత్రి కొండా సురేఖ కు ఆహ్వానం అందకపోవడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



తనతో విభేదాల కారణంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమెకు బాధ్యతలు తగ్గించారని పార్టీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఇది కాంగ్రెస్ పార్టీలోని మహిళా నేతలలో అసంతృప్తిని మరింత పెంచినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.ఇదిలా ఉంటే ఎమ్మెల్యేలలో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై తీవ్రంగా అసహనం పెరుగుతోందని ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయించడం లేదన్న కారణంతో పలువురు ఎమ్మెల్యేలు సీఎంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. సొంత ప్రభుత్వంపైనే అనిరుద్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి వంటి నేతలు తీవ్ర విమర్శలు చేయడం కాంగ్రెస్‌లో పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉందో తెలియజేస్తోంది.మొత్తం మీద చూస్తే రేవంత్ రెడ్డి నాయకత్వ శైలి, సొంత నిర్ణయాలలో పారదర్శకత లోపిస్తుందని మంత్రులు,ఎమ్మెల్యేలతో సమన్వయం లేకపోవడం వంటి అంశాలు కాంగ్రెస్ పార్టీకి పెద్ద సవాలుగా మారుతున్నాయి. ఈ విభేదాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరగా పరిష్కరించకపోతే, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ పార్టీ అంతర్గతంగా చాలా బలహీనపడే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మరి దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలా అందిస్తారు వేచి చూడాలి.

## ఆప్ కు ఇప్పుడు అధికారం, డబ్బే ముఖ్యం

**- అన్నా హజారే తీవ్ర విమర్శలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లో శుక్రవారం పెను రాజకీయ దుమారం రేగింది. ఇటీవలే డిప్యూటీ లీడర్ పదవి నుంచి తొలగించబడిన రాఘవ్ చద్దాతో సహా ఏకంగా ఏడుగురు రాజ్యసభ ఎంపీలు పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. తామంతా బీజేపీలో చేరుతున్నట్లు స్పష్టం చేయడంతో ఆప్ అధిష్ఠానం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. ఈ పరిణామంపై ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే స్పందిస్తూ, ఆప్ నాయకత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అధికారం, డబ్బుకే ఆప్ ప్రాధాన్యం ఇవ్వడమే ఈ పరిస్థితికి కారణమని ఆయన ఆరోపించారు. విలేకరులతో మాట్లాడిన అన్నా హజారే, పార్టీని వీడిన ఎంపీలు అంతర్గతంగా కొన్ని సమస్యలు ఎదుర్కొని ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. "ఏ నాయకుడైనా పార్టీని వీడితే, అది పార్టీ నాయకత్వం చేసిన తప్పే. ఆప్ సరిగ్గా పనిచేసి ఉంటే, దాని నాయకులు పార్టీని వీడి ఉండేవారు కాదు. స్వార్థం పెరిగినప్పుడు, మనుషులు తమ సిద్ధాంతాలను మరచిపోతారు" అని హజారే వ్యాఖ్యానించారు. "సమాజానికి, దేశానికి ప్రాధాన్యత ఇస్తూ పార్టీ పనిచేసి ఉంటే ఈ నాయకులు వెళ్లిపోయేవారు కాదు. కానీ వారు ఆ సూత్రాలను పక్కనపెట్టి అధికారం, డబ్బుపై దృష్టి పెట్టారు" అని ఆయన ఆరోపించారు. అదే సమయంలో, ప్రజాస్వామ్యంలో ఒక పార్టీని వీడాలా వద్దా అనేది వ్యక్తిగత హక్కు అని, ఎవరినీ బలవంతం చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, పార్టీ మారడంపై రాఘవ్ చద్దా మీడియా సమావేశంలో వివరణ ఇచ్చారు. రాజ్యసభలో ఆప్‌కు ఉన్న 10 మంది ఎంపీలలో ఏడుగురితో కలిసి బీజేపీ పార్లమెంటరీ వర్గంలో విలీనం కావడానికి గల కారణాలను ఆయన వెల్లడించారు. "నేను నా జీవితంలోని 15 సంవత్సరాలు అంకితం చేసిన ఆప్.. ఇప్పుడు నిజాయతీ రాజకీయాల నుంచి పక్కకు తప్పుకుంది. నేను తప్పుడు పార్టీలో ఉన్న సరైన వ్యక్తిని. అందుకే పార్టీకి దూరంగా, ప్రజలకు దగ్గరగా వెళ్తున్నాను" అని చద్దా ఆవేదన వ్యక్తం చేశారు.

## పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కథ ముగిసింది

**- లైసెన్స్ రద్దు చేసిన ఆర్బీఐ**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రముఖ యూపీఐ ఆధారిత ఆర్థిక సేవల సంస్థ పేటీఎంకు చెందిన పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ లైసెన్సును రద్దు చేసింది. ఏప్రిల్ 24వ తేదీన పనివేళలు ముగిసిన తర్వాత ఈ రద్దు నిర్ణయం అమల్లోకి వస్తుందని ఆర్బీఐ ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. బ్యాంకింగ్ నియంత్రణ చట్టం 1949, సెక్షన్ 22(4) కింద ఈ చర్యలు తీసుకున్నట్లు ఆర్బీఐ తెలిపింది. ఈ నిర్ణయంతో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ తక్షణమే ఎలాంటి బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహించకుండా నిషేధం విధించింది. బ్యాంకును పూర్తిగా మూసివేసే (వైండింగ్ అప్) ప్రక్రియ కోసం హైకోర్టును ఆశ్రయించనున్నట్లు కూడా వెల్లడించింది.అయితే, డిపాజిటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్బీఐ భరోసా ఇచ్చింది. బ్యాంకు వద్ద ఉన్న డిపాజిటర్లందరికీ వారి డబ్బును తిరిగి చెల్లించేందుకు సరిపడా నగదు నిల్వలు ఉన్నాయని స్పష్టం చేసింది. బ్యాంకు కార్యకలాపాలు డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉండటం, యాజమాన్యం తీరు ప్రజాప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండటం, లైసెన్స్ షరతులను ఉల్లంఘించడం వంటి కారణాలతో లైసెన్సును రద్దు చేసినట్లు ఆర్బీఐ వివరించింది. గతంలో 2022 మార్చి నుంచి కొత్త కస్టమర్ల చేరికపై, 2024 జనవరి నుంచి డిపాజిట్లు, టాప్-అప్‌లపై ఆర్బీఐ ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా పూర్తిస్థాయిలో లైసెన్సును రద్దు చేస్తూ కఠిన నిర్ణయం తీసుకుంది.

# తెలంగాణాలో ఏపీ సెంటిమెంట్

**- ఏపీ పార్టీల మద్దతు అందుకేనట!**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఏపీలో ఏదో ఒక పార్టీతో పరోక్ష మద్దతును కోరుకుంటున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా కొన్ని దశాబ్దాల పాటు హైదరాబాద్ నగరం రాజధానిగా ఉండటంతో పాటు అనేక మంది పలు జిల్లాలలకు వచ్చి సెటిలయిన ఆంధ్ర ఓటర్ల సంఖ్య ఎక్కువ. ఎన్నికల్లో వీరి మద్దతు కావాలంటే ఏపీలోని ప్రధాన పార్టీల మద్దతు అవసరం అని అందరూ గుర్తించినట్లుంది. అందుకే తమ ప్రత్యర్థి పార్టీలపైన చేసే విమర్శలకంటే ఏపీలో ఉన్న నేతలపై విమర్శలు చేస్తూ సెంటిమెంట్ రాజేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు కనపిస్తుంది.

**- బీఆర్ఎస్ వైసీపీతో**

ఇటీవల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జగిత్యాల లో జరిగిన సభలో చంద్రబాబు పై విమర్శలు చేశారు. బీఆర్ఎస్ తొలి నుంచి ఏపీలో ఉన్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు కొంత సానుకూలంగా ఉంటారు. జగన్ సీఎం గా ప్రమాణ స్వీకారానికి కూడా కేసీఆర్ హాజరయ్యారు. జగన్ కూడా అనేక సార్లు కేసీఆర్ ను ప్రగతి భవన్ లో కలిశారు. తెలంగాణలో ఉన్న రెడ్డి సామాజికవర్గం ఓటర్లను ఆకట్టుకునేందుకు కేసీఆర్ జగన్ పట్ల సానుకూలంగా ఉన్నట్లు ఎవరికైనా అర్థమవుతుంది. ఏపీలో వైసీపీని అభిమానించే సెటిలర్లు తెలంగాణలో తమకు మద్దతిస్తారని భావించి చంద్రబాబు పై విమర్శలను కేసీఆర్ తరచూ చేస్తుంటారు.

**- కాంగ్రెస్ టీడీపీతో**

ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏపీలో ఉన్న తెలుగుదేశం పార్టీకి సానుకూలమే. టీడీపీకి ఇప్పటికే తెలంగాణలో బలమైన ఓటు బ్యాంకు ఉందని భావించి చంద్రబాబు తో సఖ్యత పాటిస్తుంటారు. అదే సమయంలో తన పాత పార్టీ కావడంతో టీడీపీ నేతల ఇళ్లలో జరిగే శుభకార్యాలకు కూడా రేవంత్ హాజరవుతుంటారు. ఇటీవల ఢిల్లీవెళ్లినప్పుడు కూడా టీడీపీ నేతలతో కలసి రేవంత్ ఫొటోలు దిగడాన్ని సోషల్ మీడియాలో ప్రత్యర్థులు వైరల్ చేశారు. ఖమ్మం, మహబూబ్ నగర్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలతో పాటు హైదరాబాద్ నగరంలోనూ టీడీపీకి బలమైన ఓటు బ్యాంకు ఉందని నమ్మి పరోక్షంగా టీడీపీ మద్దతును ఇక్కడి కాంగ్రెస్ నేతలు కోరుకుంటారు.



**- బీజేపీ జనసేన ఓటు బ్యాంకు కోసం**

బీజేపీ విషయానికి వస్తే ఆంధ్రప్రదేశ్ లో జాతీయ పార్టీగా అది కూటమిలో ఉంది. కేంద్రంలోనూ కూటమిలో ఉంది. కానీ తెలంగాణలో వచ్చే సరికి టీడీపీతో పొత్తు పెట్టుకోరు. సెంటిమెంట్ తో దెబ్బయి పోతామని భావించి సైకిల్ పార్టీతో పొత్తుకు ఆ పార్టీ ప్రయత్నించదు. అదే సమయంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిలో ఉన్న జనసేనతో కలసి నడవాలని ఆ పార్టీ ప్రయత్నించింది.?

పవన్ కల్యాణ్ ను ప్రచారానికి కూడా ఆహ్వానించింది. అయితే చివరి నిమిషంలో దానిని రద్దు చేయించుకున్నారు. మొత్తం మీద తెలంగాణలోని మూడు ప్రధాన పార్టీలు ఏపీలోని పార్టీల ఓటింగ్ పై ఆధారపడి తమ రాజకీయాన్ని నడుపుతుండటం ప్రతి ఎన్నికల్లోనూ చూస్తాం. మరి రానున్న సమయంలో నేరుగా పొత్తు పెట్టుకుంటారా? లేక పరోక్ష మద్దతుతో ముందుకు వెళతారా? అన్నది చూడాలి.

## బీజేపీలో చేరడం లేదు

**- మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తాను బీజేపీలో చేరడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి వెల్లడించారు. ఈరోజు మధ్యాహ్నం ఆమె నాంపల్లిలోని బీజేపీ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. ఆమె బీజేపీ కార్యాలయానికి వెళ్లడం ం ా జ క ీ య ్ ా ల ో చర్చనీయాంశమైంది. ఆమె పార్టీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారితో సమావేశమయ్యారు. ఈ భేటీపై ఆమె మీడియాతో మాట్లాడుతూ, తమ భేటీకి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదని స్పష్టం చేశారు. తాను బీజేపీలో చేరడం లేదని స్పష్టం చేశారు. తాను విద్యావేత్తనని గుర్తుంచుకోవాలని అన్నారు. తాను అన్ని పార్టీలను కలుస్తానని అన్నారు. డిజిటల్ ఇండియా కోసం అన్ని పార్టీల నేతలను కలుస్తున్నట్లు ఆమె తెలిపారు. మల్లారెడ్డి యూనివర్సిటీలో ఏఐ క్యాంపస్ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించినట్లు తెలిపారు.

# తార్నాక రహదారిపై ట్రాఫిక్ కష్టాలు

- నియంత్రణలో విఫలమవుతున్న ట్రాఫిక్ పోలీసులు
- ఫుట్ పాత్ కబ్జాలతో రహదారులపై వ్యాపారాలతో వాహనదారులు ఇక్కట్లు
- నల్లకుంట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేదెలా.?
- ఉన్నత అధికారుల పర్యవేక్షణ కరువా.? లేక ప్రణాళిక లోపమా.?
- వాహనాల తనిఖీ పై ఉన్న శ్రద్ధ ఫుట్ పాత్ రోడ్ల కబ్జా చేసే వ్యాపారులపై లేకపాయే

తార్నాక (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య చాలా తీవ్రమౌతుంది. ముఖ్యంగా వ్యాపారులతో రోడ్లు, ఫుట్ పాత్ కబ్జాలు కావడంతో పరిస్థితి చేయి జారిపోతుంది. మరి వాటిని తొలగించడానికి ట్రాఫిక్ పోలీసులు ఎందుకు పూర్తిగా విఫలం చెందుతున్నారో అర్థం కాని పరిస్థితి. నల్లకుంట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తార్నాక ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకీ తీవ్రమవుతున్నాయి. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో పరిస్థితి పూర్తిగా అదుపు తప్పుతోంది. రైల్వే డిగ్రీ కాలేజ్ సమీపంలోని యూ-టర్న్ వద్ద ప్రారంభమయ్యే ట్రాఫిక్ జామ్ ఇటు ఆరాధన థియేటర్ అటు మెట్టుగూడ చౌరస్తా వరకు కిలోమీటర్ల మేర వ్యాపిస్తోంది. దీంతో ఉద్యోగాలు ముగించుకుని ఇంటికి చేరే ప్రజలు, విద్యార్థులు, అత్యవసర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారుల అభిప్రాయం ప్రకారం, ఈ ట్రాఫిక్ సమస్యలకు ప్రధాన కారణాలు ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, రహదారులపై పెరిగిన అనధికారిక వ్యాపారాలే. నడిచే ప్రజల కోసం ఉన్న ఫుట్‌పాత్‌లు పూర్తిగా వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోవడంతో, పాదచారులు కూడా రోడ్డుపైనే నడవాల్సి వస్తోంది. దీని వల్ల వాహనాల రాకపోకలు మరింత కష్టతరమవుతున్నాయి. దుకాణాలు ముందు వాహనాల పార్కింగ్, కూరగాయల, పండ్ల తోపుడు బండ్లు, ఆటోలు పెట్టుకోవడం, టిఫిన్ సెంటర్లు రహదారులపై విస్తరించడం ట్రాఫిక్ ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకుంటుందని వాహనాదారులు మండిపడుతున్నారు.

ఇంకా రైల్వే డిగ్రీ కాలేజ్ యూ-టర్న్ వద్ద సరైన ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడం సమస్యను మరింత పెంచుతోంది. ఒకేసారి రెండు వైపుల నుంచి వచ్చే వాహనాలు గందరగోళానికి దారితీస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసుల సమర్థమైన నిర్వహణ లేకపోవడం వల్ల పరిస్థితి మరింత దిగజారుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పీక్ అవర్స్‌లో ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన సిబ్బంది కనిపించకపోవడం, ఉన్నా సరైన చర్యలు తీసుకోకపోవడం పై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాహనదారుల ఆరోపణలు ఏమిటంటే ప్రతిరోజూ ఇదే పరిస్థితి ఉంటున్నా, ట్రాఫిక్ పోలీసు అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని. ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించడంలో పూర్తి నిర్లక్ష్యం, రహదారులపై అక్రమ వ్యాపారాలను అరికట్టడంలో వైఫల్యం కారణంగా ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం కాని సమస్యగా మారాయి. పైగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడం ప్రజల్లో అసహనాన్ని పెంచుతోంది.






"ప్రతిరోజూ ట్రాఫిక్ జామ్‌తో గంటల తరబడి ఇబ్బందులు పడుతున్నాం అంటున్నారు. ఫుట్‌పాత్‌లు ఖాళీ చేస్తే, రోడ్లపై వ్యాపారాలను నియంత్రిస్తే పరిస్థితి చాలా వరకు మెరుగుపడుతుంది" అని ఒక స్థానిక వాహనదారు ఆవేదన వ్యక్తం చేశాడు. మరొకరు " నల్లకుంట ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని. పీక్ టైంలో ఎవరూ సరిగా డ్యూటీ చేయడం లేదు" అంటూ మండిపడ్డారు.ఇప్పటికైనా అడిషనల్ కమిషనర్, ఉన్నత అధికారులు స్పందించి తార్నాక ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించాలి. ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించడం, రహదారులపై అనధికార వ్యాపారాలను నియంత్రించడం, ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ పెంచడం వంటి చర్యలు తీసుకుంటేనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని లేదంటే తార్నాక ట్రాఫిక్ సమస్యలు భవిష్యత్తులో మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588